నవతెలంగాణ

మెదక్

1

గురువారం | 12 సెప్టెంబరు 2024 | www.navatelangana.com

అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఫ్లాగ్‌మార్చ్



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాలతో జిల్లా సాయుధ బలగాలు, క్విక్ రియాక్షన్ టీమ్స్, పట్టణ పోలీసులతో సంగారెడ్డి పట్టణంలో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, ఈద్ మిలాద్ ఉన్ నబీ పండ ుగలు ఏకకాలంలో రావడంతో ఇరు మతాలకు చెందిన వారు ఒకరి మత సాంప్రదాయాలను ఒకరు గౌరవించి శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని డీఎస్పీ సత్తయ్య అన్నారు. సంఘవిద్రోహ శక్తులు ఎలాంటి అసత్య ప్రచారాలు చేసిన, సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ చేసిన వెంటనే జిల్లా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఆర్ఐలు రామారావు, డానియల్ కొండాపూర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, సంగారెడ్డి, విశ్వచంద్, ఇంద్రకరణ్, ఎస్ఐ విజయ్ కుమార్ తో పాటు 48 -మంది పోలీసులు, ఒక క్విక్ రియాక్షన్ టీం పాల్గొన్నారు.

గణనాధులను దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు



నవ తెలంగాణ-సిద్దిపేట

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు 4వ వార్డు, స్నేహ మిత్ర యూత్ అసోసియేషన్ లాల్ కమాన్, వాసవి యూత్ 36వ వార్డు, పార్వతీమాత యూత్ అసోసియేషన్ 38వ వార్డు గణనాధులను మాజీ మంత్రి మరీశ్‌రావు దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నాలు తొలగాలని ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, సకల కార్యసిద్ధి మన విఘ్నేశ్వరుడని అన్నారు. ఏ పూజ చేసిన..ఏ శుభ కార్యం చేసినా మొదట పూజించేది వినాయకుడినేనని అన్నారు. ఆ గణనాథుని ఆశిస్సులు మన అందరిపై ఉండాలని దేవున్ని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల్లో భద్రతా సమస్యలు తలెత్తకుండా చర్యలు

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్
- సాకిచెరువు కట్ట పై భద్రత ఏర్పాట్లను పర్యవేక్షణ



నవతెలంగాణ-పటాన్‌చెరు

వినాయక నిమజ్జనాలకు భద్రతపరమైన సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ ఏ. సంజీవరావుతో కలిసి పట్టణంలోని సాకి చెరువు కట్టపై వినాయక నిమజ్జనం భద్రత ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. పటాన్ చెరు, అమీన్‌పూర్, బొల్లారం పోలీసు స్టేషన్ల పరిధిలో గల చెరువులు, కుంటలలో వినాయక నిమజ్జనాలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, నీళ్లలోకి ఎవ్వరూ దిగకుం డా బారికేట్స్ ఏర్పాటు చేయాలని, చెరువుల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసే విధంగా సంభందిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించాల న్నారు. నిమజ్జ నానికి వచ్చి, పోయే వాహనాలకు ఇబ్బంది లేకుండా వెళ్ళడానికి అప్అండ్‌డౌన్ రోడ్లు వేరు వేరుగా ఉండాలన్నారు. ప్రతి చెరువు వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.ఎలాంటి భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా మొబైల్ పెట్రోలింగ్ చేస్తూ ట్రాఫిక్ ను కంట్రోల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసీ ఉపకమిషనర్ సురేష్. సీఐ ప్రవీణ్‌రెడ్డి, అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదతో రెండెకరాల మొక్కజొన్న చేను వదిలిపెట్టిన రైతు



నవతెలంగాణ-మద్దూరు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట. చేతికొచ్చిన మొక్కజొన్న పంటపై కోతులు రోజు మూకుమ్మడి గా వచ్చి పంటను నష్టపరచడంతో విసుగు చెందిన ఓ రైతు ఆ మొక్కజొన్న చేను ను వృధాగా వదిలి వేశాడు. దీంతో వివిధ గ్రామాల ప్రజలు వచ్చి కంకులను తెంపుకొని వెళ్తున్న సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంకెన మల్లారెడ్డి తనకున్న రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న విత్తనాలు వేశాడు. పంట చేతికి వచ్చే సమయానికి కోతుల బెడద ఎక్కువ కావడంతో. ఎన్నిసార్లు వెళ్లగొట్టేందుకు టపాసులతో బెదిరించినా, అవి చేనులో నుండి వెళ్లకపోవడంతో. విసుగు చెందిన రైతు మల్లారెడ్డి తన చేనును కోతుల బెడద భరించలేక వదిలివేస్తున్నానని గ్రామస్తులకు తెలిపాడు. గ్రామ ప్రజలు మొత్తం రెండెకరాల మొక్కజొన్న చేనులో ఉన్న కంకులు అన్ని సంచులలో నింపుకొని తీసుకువెళ్లారు. ప్రభుత్వం ఇప్పటికైనా పట్టించుకొని కోతుల బెడద నుంచి రైతులను కాపాడాలని రైతు మంకెన మల్లారెడ్డి కోరారు.

గీతం స్కాలర్ కొప్పుల సురేష్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి కొప్పుల సురేష్, డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'యూరేనియం, స్ట్రోంటీయం, సీసీయంల తొలగింపు కోసం ఎంఓఎఫ్ఎస్ (స్థిరమైన లోహ-సేంద్రీయ ఫ్రేమ్ వర్క్), వాటి మిశ్రమాల సంశ్లేషణ, లక్షణం' అనే అంశంపై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎంఎస్ సురేంద్ర బాబు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. సముద్రపు నీరు, భూగర్భ జలాలలో హెవీ మెటల్ కాలుష్యం ఒక క్లిష్టమైన సమస్య. ఇది పర్యావ రణం, మానవ ఆరోగ్యానికి గణనీయమైన నష్టాలను కలిగిస్తుంది. ఈ మూలకాలు మానవులు, ఇతర జీవులకు తీవ్ర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. పలు లోహ-సేంద్రీయ ఫ్రేమ్ వర్క్ ల యాసిడ్-స్థిరమైన మిశ్రమాలను సంశ్లేషణ చేయడంపై ఈ పరిశోధన దృష్టి సారించింది. ఇది సముద్రపు నీటి ద్రావణాల నుంచి కాలుష్యాన్ని తొలగించడానికి విజయవంతంగా ఉపయోగప డ్డాయి' అని డాక్టర్ సురేంద్ర తెలిపారు. అంతేగాక ఈ కాలుష్య కారణాలను సముద్రపు, అణు వ్యర్థాల నుంచి సమర్థంగా తొలగించామన్నారు. ఈ పరిశోధన ద్వారా ప్రజారోగ్యంలో హెవీ మెటల్ కాలుష్యం వల్ల కలిగే పర్యావరణ ప్రమాదాలను పరిష్కరించడానికి ఉపకరించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఆయన్ను అభినందించారు.

బెదిరింపులకు పాల్పడే నకిలీ విలేకరులపై కఠిన చర్యలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

విలేకర్లమంటు బెదిరింపులకు పాల్పడే నకిలీ విలేకరులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ మధ్యన నకిలీ విలేకరుల బెడద ఎక్కువైందన్నారు. స్థానికంగా ఇండ్లు నిర్మించుకునే సామాన్యులతో పాటు బిల్డర్స్ వద్దకు వెళ్లి అన్ని శాఖల అధికా రులతో పరిచయాలు ఉన్నాయని, డబ్బులు ఇవ్వాలని ఇవ్వకుంటే అధికారులకు చెప్పి ఇల్లు కూలగొట్టిస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడే నకిలీ విలేకరులపై ఫిర్యాదు చేస్తే.. వారిపై చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే ఒకరిని అరెస్టు చేసినట్లు, మరొకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిమజ్జనంలో డీజే సౌండ్స్ నిషేధం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్స్ వినియోగం నిషేధమని, అదేశాలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని ఎస్ఐ క్రిష్ణా రెడ్డి బుధవారం తెలిపారు. శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని ఎస్ఐ సూచించారు.

ఆడపిల్లలకు... ఆత్మ రక్షణ విద్య

- 6-10వ తరగతి విద్యార్థినీలకు శిక్షణ
- చదువులకు ఇబ్బంది రాకుండా జాగ్రతలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 699 స్కూల్స్ ఎంపిక
- మూడు నెలల పాటు కరాటే, జూడో, కుంగుపూ శిక్షణ
- ఇన్‌స్ట్రక్టర్లకు రూ.5 వేల పారితోషికం
- సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థినీలకు ఆత్మరక్షణ విద్యను నేర్పించేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్ని గుర్తించారు. ఆ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థినీకి కూడా ఆత్మరక్షణ విద్యకు సంబంధించి కరాటే, జూడో, కుంగుపూ వంటి వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నారు. యుద్ధ విద్యలో భాగమైన వీటిల్లో శిక్షణ తీసుకోవడం, నైపుణ్యం కల్గి ఉండడం ద్వారా ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం బావిస్తుంది. విద్యార్థి దశలోనే శారీరక, మానసికంగా ధృఢత్వం కల్గి ఉండడమే కాకుండా అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు ఎదుటి వ్యక్తుల నుంచి తనకు తాను రక్షించుకునేందుకు ఆత్మరక్షణ విద్య ఎంతో తోడ్పడనుంది. ఆడపిల్లలంటే సెన్సిటివ్ పర్సన్స్‌గా బావిస్తారు. అలాగే శారీరక ధృడత్వం ఉండదనుకుంటారు. అయితే ఆడపిల్లలు సైతం అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషుల కంటే బలమైన వాళ్లుగా రుజువు చేస్తున్నారు. అయితే మొదటి నుంచి ఆడపిల్లలు మీరు జాగ్రతగా ఉండాలంటూ తల్లిదండ్రులు పదే పదే చెప్పడం ద్వారా చాలా మంది వినయడంతో నడుచుకుంటున్న పరిస్థితి ఉంది. సమాజంలో పురుషుల దాడి నుంచి తప్పించుకోవాలంటే ధైర్యం, శక్తి, టెక్నిక్ లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. సమాజంలో నిత్యం జరుగుతున్న లైంగిక దాడులు, హత్యాచారాలు, హత్యలు, దాడుల వంటి సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. అలాంటి పరిస్థితుల నుంచి తనకు తాను కాపాడుకునేందుకు ప్రతి ఆడబిడ్డ ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందు కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా స్కూల్స్ స్థాయిలోనే విద్యార్థినీలకు ఆత్మరక్షణ విద్యను అందించే ప్రయత్నాలు చేస్తుంది.

ఆడ బిడ్డకు ఇంటా బయటా రక్షణ లేని పరిస్థితి. ఎక్కడ చూసినా ఆకతాయిల వేధింపులు. ప్రేమ, పెళ్లి పేరిట దాడులు, హత్యలు, అత్యాచారాల పరంపర. వయసుతో పనిలేదు... ఆడదైతే చాలు అలుసుగా చూసి ఆగం చేయాలనే దుర్బుద్ధిపరులకు కొదవలేదు. నిత్యం జరుగుతున్న లైంగిక వేధింపులు తాళలేక ఎంతో మంది ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితి. ఎదిరించలేక బలవుతున్న వాళ్లు సైతం ఎందరో ఉన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే ఎవరో వచ్చి కాపాడడం అనేది అన్ని వేళలా సాధ్యపడదు. తనకు తాను రక్షించుకునే శక్తి, నైపుణ్యం సమకూర్చుకుంటే తప్ప దుష్టుల దురాఘాతాల నుంచి బయటపడలేదు. ఆత్మ రక్షణ కోసం యుద్ధ విద్యలో శిక్షణ, నైపుణ్యం కల్గి ఉండాలి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా విద్యార్థినీలకు ఆత్మరక్షణ విద్యను అందించాలని బావించింది. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా "రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్" పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్యను నేర్పేందుకు ఏర్పాట్లు చేశారు.

699 స్కూల్స్‌లో శిక్షణ

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 699 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్ని ఎంపిక చేశారు. వీటిల్లో 6వ తరగతి నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థినీలకు ఆత్మరక్షణ విద్యను నేర్పనున్నారు. యుద్ధ విద్యలో భాగమైన కరాటే, జూడో, కుంగుపూలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో రెగ్యులర్‌గా సాగే చదువులు, పరీక్షల సమయానికి ఇబ్బంది కల్గకుండా విద్యార్థినీలకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం విద్యా శాఖను ఆదేశించింది. సంగారెడ్డి జిల్లాలో 29 ప్రాథమికోన్నత, 221 ఉన్నత పాఠశాలకు రూ.37.50 లక్షలు, సిద్దిపేట జిల్లాలో 13 ప్రాథమికోన్నత, 245 ఉన్నత పాఠశాలలకు రూ.38.70 లక్షలు, మెదక్ జిల్లాలో 40 ప్రాథమికోన్నత, 151 ఉన్నత పాఠశాలలకు రూ. 28.65 లక్షల చొప్పున శిక్షణ కోసం నిధుల్ని కేటాయించారు. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్యను నేర్పేందుకు నిపుణ్యం కల్గిన ఇన్‌స్ట్రక్టర్లను ఎంపిక చేస్తున్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చినందుకు నెలకు రూ.5 వేల పారితోషికం విద్యా శాఖ నుంచి చెల్లించనున్నారు. మహిళా ఇన్‌స్ట్రక్టర్లను తీసుకోవాలని విద్యా శాఖ అధికారులు బావిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో కరాటే, కుంగుపూ, జూడో వంటి విద్యలో శిక్షణ ఇచ్చేందుకు మహిళా మాస్టర్లు దొరికే పరిస్థితి లేదు.

ఆత్మరక్షణకు దోహదం

స్కూల్ విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిరావడం, ఇతర సమయాల్లోనూ బయటికి వెళ్లితే ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది.

జిల్లా	ప్రాథమికోన్నత	ఉన్నత	నిధులు
సంగారెడ్డి	29	221	రూ.37.50
మెదక్	40	151	రూ.28.65
సిద్దిపేట	13	245	రూ.38.70
మొత్తం	82	617	రూ.104.85

ఒంటరిగా వెళ్లే సమయాన దాడి చేస్తున్నారు. లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో వెళ్లే సమయాల్లో విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎదుటి వ్యక్తిని ప్రతిఘటించేందుకు ధైర్యం కావాలి. అలాగే తనకు తాను రక్షించుకునేందుకు ప్రతిఘటించే టెక్నిక్స్ ఉండాలి. అందుకు తగిన శిక్షణ పొంది సాధన చేయాలి. అయితే ప్రభుత్వం పాఠశాల స్థాయిలో విద్యార్థినీలకు కరాటేలో శిక్షణ ఇప్పించడం ద్వారా లైంగింకగా వేధించినా దాడులకు పాల్పడిన ఆ పరిస్థితిలో ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుంది. ఎలా డిఫెండ్ చేయాలో కరాటే విద్యలో నేర్పుతారు. ఎదుటి వ్యక్తి చేసే దాడిని ఎదుర్కొని తిప్పికొట్టడమే కాకుండా ఎదురుదాడి చేసి గెల్వగలిగేందుకు కావాల్సిన టెక్నిక్, ధైర్యం కరాటే శిక్షణ ద్వారా లభిస్తుంది. కరాటే శిక్షణ ద్వారా శారీరక ధృఢత్వం, ధైర్యం ఏర్పడడమే కాకుండా అనేక టెక్నిక్స్ నేర్చుకోవచ్చు. కరాటేలో శిక్షణ పొందడం ద్వారా విద్యార్థి దశలోనే కాకుండా జీవితాంతం అదే ధైర్యంతో ఎదుర్కొవచ్చు. తనకే కాకుండా తోటి మహిళలకు అనుకోకుండా ఏదైన విపత్కర పరిస్థితి ఎదురైతే కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థినీ వారిని రక్షించేందుకు వీలుంటది. అంటే కారాటే లాంటి విద్యను నేర్చుకోవడం ద్వారా తనకే కాకుండా కుటుంబంలోని మహిళలు, ఇతర మహిళలకు సైతం తోడుగా నిలిచేందుకు ఉపయోగపడుతుంది.

ఆడపిల్లలకు రక్షణ నిస్తుంది: వెంకటేశ్వర్లు, డీఈఓ

ఆత్మరక్షణ విద్య ఆడపల్లలకు ఎంతో రక్షణ ఇస్తుంది. కరాటే, ఇతర ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం ద్వారా ఆడపిల్లలు నిర్భయంగా చదువుల్ని కొనసాగిస్తారు. తల్లిదండ్రులు సైతం మనోధైర్యంతో తమ పిల్లల్ని స్కూల్‌కు పంపేందుకు ముందుకొస్తారు. ప్రతి విద్యార్థినీ కరాటే, కుంగుపూ, జూడో లాంటి విద్యలో శిక్షణ పొందాలి. అందు కోసం అవసరమైన ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తున్నాం.

వంటావార్పుతో రెండోరోజు నిరసన

- ఏపిటోరియం ఫార్మా యూనిట్-1 ఎదుట
- కొనసాగుతున్న ఆందోళన



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని బోర్పట్ల గ్రామశివారులో గల ఏపిటోరియం ఫార్మా యూనిట్-1 పరిశ్రమ ఎదుట కార్మికులు రెండో రోజు వంటావార్పుతో నిరసన దీక్ష చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు ఉద్యోగ భద్రతపై హామీ ఇచ్చేవరకు నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించారు. కొన్నేండ్లుగా పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయకుండా కాలయాపన చేయడంపై మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు పర్మనెంట్ చేస్తూ స్థానికులకు మొండి చేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల నిరసన దీక్షకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి స్థానిక కార్మికులకు వెంటనే పర్మెంటు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎపిటోరియం కార్పొరేట్ హెచ్ఆర్ మేనేజర్ అశ్విన్ కుమార్, కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడుతూ.. బోరపట్ల స్థానిక కార్మికులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ పర్మినెంట్ ఉద్యోగంతో పాటు ఇతర బెనిఫిట్స్ కల్పించడానికి పరిశ్రమ యజమాన్యంతో చర్చించి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా సమ్మె విషయం తెలిసి.. జిన్నారం సీఐ సుధీర్ కుమార్ ఎస్ఐ సుభాష్ పోలీస్ సిబ్బందితో పరిశ్రమ వద్దకు చేరుకొని బందోబస్తు చేపట్టారు. చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతో కార్మికులు టెంటు వేసుకొని నిరసన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. పరిశ్రమ యాజమాన్యం స్పందించి రాతపూర్వకంగా హామీ ఇస్తేనే నిరసన విరమింపజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నాగ ప్రభుగౌడ్, సతీష్ యాదవ్, తోట రాజు, కొలన్ రవి, మల్లేష్,కమలాకర్, శ్రీశైలం, సాయిరాం, తిరుమలయ్య, రమేష్, ఆంజనేయులు, ప్రవీణ్ అనిల్, రమేష్, గణేష్, రాజశేఖర్, రవికుమార్. తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు ఆక్రమణకాకుండా చర్యలు తీసుకోవాలి

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలి
- నీటిపారుదల శాఖ, సర్వేల్యాండ్ రికార్డ్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని చెరువులు, కుంటలు కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.. రెవెన్యూ సర్వేల్యాండ్ రికార్డ్, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో జిల్లాలోని హెచ్ఎండిఏ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన చెరువులు కుంటలపై తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండిఏ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 666 చెరువులు, కుంటలకు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ కొరకు మ్యాప్లను సిద్ధం చేయాలన్నారు. హెచ్ఎండిఏకు 666 చెరువులకు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ మ్యాప్లను పంపాలన్నారు. వెబ్సైట్లో 666 చెరువుల వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. చెరువుల మ్యాపులు సిద్ధం చేసేటప్పుడు తప్పులు లేకుండా ఒకటికి రెండుసార్లు సరిచూసు కోవాలన్నారు. గ్రామంలో చిన్న, పెద్దచెరువుల ఎఫ్‌టిఎల్ పరిధి, బఫర్‌జోన్ల హద్దులు గుర్తించి వాటిలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటివరకు హెచ్ఎండిఏకు పంపిన మ్యాప్‌లో వివరాలతో పాటు మిగిలిన చెరువుల వివరాలు వీలైనంత త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు. చెరువులు , కుంటల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసేటప్పుడు తప్పని సరిగా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపాలన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలను తొలగించాలన్నారు. ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో ఎటువంటి నిర్మాణాలను అనుమతించొద్దని ఆదేశించారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఇండ్లలోకి వరద నీరు రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, వీటన్నిటిని పరిష్కరించాలని ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా అధికారులు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు కుంటలు ఎఫ్టిఎల్, బఫర్ జోన్లతో పాటు వరద కాలువల ఆక్రమణలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల న్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సేర్వే ల్యాండ్ రికార్డ్ ఐనేష్, డీఈ యేసయ్య, ఈఈ భీమ్, హెచ్ఎండిఏ పరిధిలోని ఎనిమిది మండలాల తహసీ ల్దార్లు,నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జెఏసి ఆధ్వర్యంలో నిరసన



నవ తెలంగాణ-సిద్దిపేట

30 సంవత్సరాలుగా కొనసాగు తున్న డైరెక్ట్ అపాయింట్మెంట్ ఉద్యోగుల మెరిట్ కం, రోస్టర్ సీనియారిటీ విధానం, పదోన్నతి తరువాత కాన్సిక్వేన్షి యల్ సీనియారిటీ కొనసాగింపును ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులకు కొనసాగించాలని తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షులు స్వామి దాస్, సెక్రటరీ కనకయ్యలు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జేఏసీ పిలుపులో భాగంగా బుధవారం భోజన విరామ సమయంలో తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాదాస్పదమైన టిఓఓ 954, ఎస్ఓఓ 37, ఎస్పిఓఓ 101, టిజిఓఓ 62 ఆర్డర్లను రద్దు చేయాలని కోరారు. కాన్సీక్వెన్షియల్ సీనియారిటీని కొనసాగించాలనీ, ఆర్టీజన్ల డిమాండ్స్ కన్వర్షన్, ఏపీ ఎస్ ఈ బి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు నిరసనలు తెలుపుతామని, ఈ నెల 16 వరకు భోజన విరమణ సమయంలో ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసనలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షులు రాజ మల్లయ్య, సెక్రటరీ లక్ష్మణ్, నాయకులు మల్లేశం, నరేష్, ప్రదీప్, బాల్ నరసయ్య, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో గాయపడిన సంతోష్‌రెడ్డికి హరీశ్‌రావు పరామర్శ



నవతెలంగాణ-గుమ్మడిదల

ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాన్వాయ్‌పై కొందరు దాడికి పాల్పడగా.. గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యావన్నగారి సంతోష్ రెడ్డి కాలు విరిగి, గాయాలపాలైన విషయం విధితమే. అయితే ఆయన చికిత్స తీసుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి రావడంతో.. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డితో పాటు తన్నీరు హరీశ్‌రావు బుధవారం రోజున సంతోష్‌రెడ్డి ఇంటికి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేరుకు ప్రజాపాలన కానీ.. ప్రజాస్వామ్యం మొత్తం కూని అయిపోయిందన్నారు. వరద బాధితులకు సహాయం చేయడానికి వెళ్తే.. కాంగ్రెస్ శ్రేణులు తమపై దాడి చేసి సంతోష్‌రెడ్డి కాలు విరగొట్టారన్నారు. కాగా కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడితే.. బీఆర్ఎస్ నాయకులనేపై పోలీసులు కేసులు పెట్టడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ప్రతిపక్షాన్ని అణిచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రజలు వాస్తవాలు చూశారని సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొలను బాల్ రెడ్డి, జి వెంకటేశం గౌడ్, మల్లేష్ గౌడ్, అభిశెట్టి రాజశేఖర్,శ్రీనివాస్ రెడ్డి, నాయికోటి రాజేష్, మెట్టుకుమార్ యాదవ్, ఆదర్శరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళా గ్రూప్ సభ్యులను మోసం చేసిన ఏజెంట్ భర్త

పదాలపల్లిలో వెలుగులోకొచ్చిన ఘరానా మోసం



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లి లో అంబేద్కర్ మహిళా గ్రూపు సభ్యులకు చెందిన రూ.6.68 లక్షలు బ్యాంకులో చెల్లించకుండా మొదటి ఏజెంట్ మిన్నీ మాల్ భర్త కానుకుంట బిక్షపతి సొంత ఖర్చులకు వాడుకొని మహిళా గ్రూప్ సభ్యులను మోసం చేశారు. మహిళా గ్రూప్ సభ్యులు ప్రతినెల రూ.41 వేలు బ్యాంకులో గ్రూప్ ఖాతాలో జమ చేయాలి. కానీ మొదటి ఏజెంటు మినీ మాల్ భర్త బిక్షపతి గ్రూప్ సభ్యుల దగ్గర ప్రతినెల డబ్బులు వసూలు చేసి, దోపిడి చేసి మహిళలను మోసం చేశాడని మహిళా గ్రూప్ సభ్యులు బ్యాంకు దగ్గర నిరసన తెలిపి బ్యాంకు అధికారులతో లబోదిబో అని మొత్తుకున్నారు. అంబేద్కర్ మహిళా గ్రూపులో కానుకుంట బిక్షపతి భార్య ఎజెంట్‌గా వ్యవమరించడంతో చేతివాటం ప్రదర్శించారు. బ్యాంక్‌కు కట్టాల్సి ఉన్న రూపాయలను భార్యను అడ్డు పెట్టుకొని తానే వసూలు చేసుకుంటూ కాజేసాడని తెలిపారు. తీరా బ్యాంకుకి వెళ్లి చూడగా రూ.6,68,000లను కట్ట లేదని బ్యాంక్ అధికారులు తెలుపడంతో విస్తుపోవడం తమవంతయింది. రెండవ ఏజెంట్‌కు తెలియకుండా డబ్బులు వసూలు చేశాడన్నారు. తన భార్యను పట్టుకొని డబ్బులు అడుగుతారని ముందే గ్రహించి, తన భార్యపై భర్త కానుకుంట బిక్షపతి మంగళవారం దాడి చేయడానికి ప్రయత్నిస్తుండగా పడాలపల్లిలోని మహిళా గ్రూపు సభ్యులు బిక్షపతిని అడ్డుకున్నారని అంబేద్కర్ గ్రూప్ మహిళలు తెలిపారు.

పోలీసుకు ఫిర్యాదు

తమ దగ్గర తీసుకుని లోన్ కట్టాల్సిన డబ్బులను ఇవ్వాలని గ్రూప్ సభ్యులు అడిగితే బిక్షపతి మహిళా గ్రూపు సభ్యులపైన విచక్షణారహితంగా దాడి చేశాడని రెండవ ఎజెంటు ముఖద్దం సిద్దమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము చాలా కష్టపడి, కూలీనాలి చేసి డబ్బులు చెల్లించామన్నారు. తమను విపరీతమైన బూతులు తిడుతూ, తమను కట్టెతో దాడి చేయడానికి వచ్చాడని తెలిపారు. కావున గ్రూపు సభ్యులను నమ్మించి లోన్ కట్టాల్సిన డబ్బులను స్వంత అవసరాలకు వాడుకుని తమపై దాడి చేసిన మిన్నీ మోల్ భర్త బిక్షపతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తూప్రాన్ ఎస్సై శివానంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-కంది

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత పది నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. వారికి వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లిం చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. మండలంలోని కాశీపూర్ గ్రామ పరిధిలో గల మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. వేతనాలు ఇవ్వాలని అనేకసార్లు కాంట్రాక్టర్లను, అధికారులను అడిగితే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. రెండ్రోజుల్లో వేతనాలు చెల్లించకుంటే ఎస్ఈ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. వేతనా లు అడిగిన కార్మికులను బెదిరిస్తున్నారన్నారు. గత పదేండ్ల నుంచి పనిచేస్తున్నా. నేటికీ కనీస వేతనం లేదని కేవలం రూ.9500 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతు న్నారన్నారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఐడి కార్డ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోనర్సింలు, శ్రీకాంత్, లక్ష్మణ్, యాదయ్య, సాయికుమార్, లింగం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సంగారెడ్డి

2

గురువారం | 12 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన రికార్డ్ అసిస్టెంట్ సర్వ సాయిలు సాగర్ మనవరాలు మొదటి పుట్టినరోజు వేడుకలను శ్రీ ఏడుపాయల వనదుర్గ భవాని మాతా ఆలయం వద్ద బుధవారం ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొని.. చిన్నారిని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆయన్ను పూలమాలతో సత్కరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసి అంజయ్య సాగర్,నాయకులు మోహన్ సాగర్,ప్రశాంత్ సాగర్, శ్రీకాంత్ సాగర్, గ్రామపంచాయతీ సెక్రెటరీ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేపూర్ గ్రామంలో హెల్త్‌క్యాంపు



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని ఫతేపూర్ గ్రామంలో బుధవారం హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రతిభ మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువయ్యే ప్రమా దం ఉన్నందున ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటితోపాటు పరిసరాలను కూడ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాగా ఎవరికైనా వాంతులు, విరేచనాలు, జ్వరం, ఒళ్ళు నొప్పులు, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే.. వెంటనే ఆశావర్కర్ ను సంప్రదించాలన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ చంద్రశేఖర్, హెచ్ఏ రామచందర్, ఏఎన్ఎం స్వరూప, ఆశా హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ వెంకట్‌ను పరామర్శించిన కెకె లడ్డు



నవతెలంగాణ-సంగారెడ్డి

సినీ నటుడు ఫిష్ వెంకట్ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. సంగారెడ్డి చిరంజీవి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు కేకే లడ్డు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడవడంతో డయా లసిస్ చేసుకుంటున్నాడని.. కాలుకు తీవ్రమైన ఇన్ఫెక్షన్ కావడంతో సర్జరీ జరిగిందన్నారు. కాగా ఆయనకు తనవంతు సహాయం చేస్తానన్నారు. కిడ్నీ వైద్యం కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుని కలిసిన భేల్ ఉద్యోగులు



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అమృత రావును ఇటీవల నూతనంగా ఎన్నికైన భేల్ ఎస్సీ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరం కలిసికట్టుగా పని చేయాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో భేల్ ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి దేవా అర్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్, ఉపాధ్యక్షులు కొడాలి సురేష్, కోశాధికారి నరసింహులు, జాయింట్ సెక్రెటరీ స్వామి దాస్, మాజీ అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి శివకుమార్.. స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి, మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్‌తో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. రైతులకు విక్రయించిన ఎరువులు, పురుగు మందులకి సంబంధించి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అలాగే వాటికి సంబంధించిన ఇన్వాయిస్‌లు అన్ని నిబంధనల అనుగుణంగా సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న మినుము, కంది పంట పొలాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, రైతులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్'లో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్-జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పాలకవర్గం సభ్యులు బుధవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, పట్లోళ్ల రేఖ ప్రవీణ్, కోరబోయిన నాగరాజు, భవాని నాగరత్నం గౌడ్, భాగ్యలక్ష్మి లక్ష్మణ్, నాయకులు పడిగే సత్యం, ఉలువల వెంకటేశం, సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, ఆపరేటర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిభ ఎకో ఫ్రెండ్లీ గణేషుడి నిమజ్జనం



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గల ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్లో ఏర్పాటుచేసిన ఎకో ఫ్రెండ్లీ గణేషుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవా రం నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధమైన రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్, అధ్యాపక బృందం సునీల్ కుమార్ మానస, సౌందర్య, శోభారాణి, అరుణ, శైలజ, మమత విద్యార్థి బృందం పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సంగారెడ్డిలో చోటుచేసుకుంది. సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన అవుటి జనార్దన్ సంగారెడ్డిలో కిరాయికి ఉంటూ.. ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 4న రాత్రి 7:30 గంటల సమయంలో కుటుంబ కలహాల వల్ల భార్యతో గొడవపడి.. టీజీ 15 1514 నెంబర్ గల బైక్‌పై బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య లావణ్య బంధువుల వద్ద, తెలిసిన వాళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో అతడి భార్య మంగళవారం రోజున పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.అతడి సమాచారం తెలిస్తే సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌కు 08455-276333, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు 8712656718 ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

నీటి గుంతలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పటాన్‌చెరు

నీటి గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్నాపూర్ శివారులో గల ఓడిఎఫ్ కాలనీ పక్కన ఉన్న సృజన హెూమ్స్ గుడ్ టైం బిల్డర్స్ కన్స్ట్రక్షన్‌లో ఇంచార్జ్ జుమ్ము జయంత్‌రెడ్డి.. రోజు మాదిరిగానే బుధవారం పనులు చేయిస్తుండగా ముందున్న నీటి గుంతలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే వారు పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెంటనే చేరుకుని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండగా.. వెంటనే బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వయస్సు అందాజ 25 నుంచి 30 ఏండ్ల మధ్య ఉంటుందని.. శరీరంపై నీలిరంగు జీన్స్ ప్యాంటు, తెలుపు నలుపు రంగు ఫుల్ టీ షర్టు ఉన్నదని పోలీసులు తెలిపారు. కుడి చేతి పై హిందీలో మా(షా) అని పచ్చబొట్టు ఉందన్నారు. తన ప్యాంటును మోకాలు వరకు సరిచేసుకుని నీటి గుం తలో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందినట్టు కనిపిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తెలియజేయాలన్నారు. కనస్ట్రక్షన్ ఇంచార్జ్ జయంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై అభిమాన్‌సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి



నవతెలంగాణ-వట్‌పల్లి

బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం 161 నేషనల్ హైవే రోడ్డులో అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ స్టేజ్ వద్ద జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన సాయికిరణ్ వట్‌పల్లి మండలంలోని అభివృద్ధి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్(సీఓ)గా విధులు నిర్వహిస్తున్నాడు. విధినిర్వహణలో భాగంగా బుధవారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన ఆడిట్‌లో పాల్గొని.. తన స్కూటీపై తిరిగి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో రాంపూర్ స్టేజ్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అల్లాదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

నీట మునిగిన పత్తి..

పెట్టుబడి కూడా రాని దుస్థితి



- రోజుల తరబడ నీళ్లు నిల్వడంతో రాలిపోతున్న పూత, కాయలు
- లక్షల సొమ్ము కన్నీటి పాలు..
- అగమ్యగోచరంగా కౌలు రైతుల పరిస్థితి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ఎడతెరిపి లేకుండా కొన్ని రోజుల పాటు కురిసిన వర్షాలు రైతన్నకు తీరని కన్నీటిని మిగిల్చాయి. సీజన్ ప్రారంభంలో అడపాదడపా వానలు పడడంతో.. ఈ యేడు పంటలు పండుతాయా లేదా అన్న పరిస్థితి నెలకొన్నది. పది రోజుల క్రితం వరకు కూడా చెప్పుకోదగ్గ వర్షం పడలేదంటే అతిశయోక్తి కాదు. అయితే నాడు కురిసిన ఆ చిన్నపాటి జల్లులకే రైతులు విత్తనాలు నాటారు. వర్షాలు తక్కువగా ఉండడంతో చాలా మంది పత్తిపంట వైపు మొగ్గు చూపారు. కాగా పంట నేడు పూత, కాయ దశకు వచ్చింది. ఈ సమయంలో గత వారంరోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటచేన్లు మొత్తం మునిగిపోయాయి. రోజు ల తరబడి నీళ్లు నిల్వ ఉండడంతో.. పత్తి, పెసర, మొక్కజొన్న, మినుమ లాంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పత్తిపంటకు సంబంధించి పూత, కాయ రాలుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షల పెట్టు బడి పెట్టిన కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నారాయణఖేడ్ నియోజకవర్గానికి సంబంధించి 92,635 ఎకరాల్లో పత్తి, 8039 ఎకరాల్లో పెసర, 3845 ఎకరాల్లో మినుములు, 27,946 ఎకరాల్లో సోయా, 28034 ఎకరాల్లో కందులు, 38,935 ఎకరాల్లో వరి, 1172 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పంట చేన్లన్నీ నీటితో నిండి చెరువులను తలపించాయి. దాంతో 20శాతం మేర పంటలు దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది.

నారాయణఖేడ్ మండలంలోని చల్లగిద్ద తాండాకు చెందిన రైతు రాజు నాయక్ తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. సుమారు ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే అకాల వర్షంతో పత్తి చేను మొత్తం దెబ్బతిన్నదని ఆ రైతు వాపోతున్నాడు. పత్తి ఆకులు, కాయలు వాటంతటవే రాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే అదే తాండాకు చెందిన ఓ అన్నదమ్ములు 45 నుంచి 50 ఎకరాల వరకు కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేస్తున్నారు. సుమారు రూ.25 నుండి 30 లక్షల వరకు పెట్టుబడి కూడా పెట్టినట్టు చెప్పారు. అయితే వర్షాలకు పంట మొత్తం దెబ్బతిన్నదని సదరు రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. గూడ రాలిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడైనా వస్తుందో లేదో అని వాపోతున్నారు. పత్తి చేన్లే కాకుండా.. మొక్కజొన్న, పెసర, మినుము, కూరగాయ పంటలు కూడా పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయి. కాబట్టి తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం

- వ్యవసాయ అధికారి

ప్రభుత్వ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నాం. వివరాలు నమోదు చేసుకుని.. పై అధికారులకు నివేదికలు పంపిస్తాం.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి..



పదిరోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కాబట్టి నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.40000 ఇవ్వాలి.

- మాణిక్యం, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

కార్మికుల హక్కులను కాలరాస్తున్న వివిధ పరిశ్రమలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలని న్యూల్యాండ్ పరిశ్రమ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఉన్నటు గ్రాన్యూల్స్, శామ్ పిస్టన్, హెటిరో డ్రగ్స్, హనార్, లోకేష్, క్లారియాట్, టీవీఎస్ సుందరం, శ్రీవత్స డ్రగ్స్, ఎంఎస్ఎన్, మైత్రి డ్రగ్స్, వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను బుధవారం అడిగి తెలుసుకున్నారు. ఆ సమాచారాన్ని రాష్ట్ర కమిటీకి అందజేసి..సంబంధిత పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా సీఐటీయూ కార్మిక సంఘం యూనియన్ నాయకులు శ్రీధర్‌రావు, సురభి వెంకటేష్ గౌడ్, హుస్సేన్ మాట్లాడుతూ.. పలు పరిశ్రమలో వివిధ రాష్ట్రాల వలస కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతూ.. కనీసం ఈఎస్ఐ, పిఎఫ్, సేఫ్టీ పరికరాలు తదితర సౌకర్యాలను కూడా ఇవ్వట్లేదన్నారు. ఆ పరిశ్రమ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి రవి, గోపాల్, దుర్గారావు, వివిధ పరిశ్రమల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్ - 2025 లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి బీఎల్ఓ యాప్ ద్వారా కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అవసరం ఉన్న చోట పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాంటి పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తే, వాటి వివరాలను తమ దృష్టికి తేవాలని సూచించారు. అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటించడం జరుగుతుందని, దానిని పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. ఈ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలన్నీ పోలింగ్‌బూత్‌ల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వ తేదీలోపు రెండు పర్యాయాలు పోలింగ్ బూత్ స్థాయిలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాఫ్ట్ రోల్ లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి సవరిస్తారన్నారు. ఓటరు జాబితాలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖుల పేర్లు ఉన్నాయా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. 2025 జనవరి 1నాటికి 18ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చూడాలని కోరారు. అర్హులైన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఆంథోనీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్జ్ రైతులకు అవగాహన సమావేశం



నవతెలంగాణ-న్యాల్‌కల్

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రేజింతల్ రైతులకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రేజింతల్‌లో పట్టా, గౌటాన్ భూములు 1700 ఎకరాలు నిమ్జ్ పరిధిలో ఉన్నాయన్నారు. భూ సేకరణలో ఇప్పటి వరకు 350ఎకరాలకు నష్టపరిహారం కోసం నివేదిక తయారు చేసినట్టు చెప్పారు.భూములు ఇచ్చేవారు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు.నిమ్జ్‌లో భూములు పోతే ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో పేదలకు భూములు పంచాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్
- సాయుధ రైతాంగ పోరాట బుక్లెట్ విడుదల



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో పేదలకు భూములు పంచాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపడతామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారోత్సవాల బుక్లెట్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెల్లో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ మతంరంగు పులిమి రాజకీయం చేస్తోందన్నారు. నాటి స్వాతంత్ర్య, సాయుధ రైతాంగ పోరాటలను గుర్తు చేయాల్సిన పాలకులు వాటిని రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, ఈ పోరాటంలో నాలుగు వేల మంది వీరులు ప్రాణ త్యాగాలు చేసారని గుర్తు చేశారు. పాలకుల దోపిడీని అరికట్టేందుకు మరో పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నారాయణఖేడ్ ఏరియా కమిటీ నాయకులు రమేష్, నాయకులు సతీష్, అరుణ్, ప్రజా సంఘాల నాయకులుకాన్సిరాం, మైపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలు.. నిలిచిన బస్సులు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

నవతెలంగాణ-హత్నూర

గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని షేర్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పలుగు పోచమ్మ ఆలయం ఎదుట ప్రధాన రోడ్డు గుంతలుగా మారింది. దాంతో ఆ దారిగుండా ప్రయాణాలు సాగించే ప్రజలు, ఆలయానికి వెళ్లే భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఈ రోడ్డు గుండానే జిన్నారం, నర్సాపూర్ పట్టణాలకు వెళ్తుంటారు. కానీ వర్షాల వల్ల ఈ రోడ్డు మొత్తం దెబ్బతినడంతో.. విద్యార్థులు పాఠ శాల, కళాశాలకు సరైన సమయానికి వెళ్లలేకపో తున్నారు. అంతేకాకుండా రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో.. ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు.దాంతో చిరువ్యాపారులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతల వల్లే బస్సులు నిలిపివేశాం

- ఆర్టీసీ డిపో మేనేజర్

షేర్కన్‌పల్లి గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉండేది.. కానీ రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతల వల్ల ఈ సర్వీసులను నిలిపివేశాం. ఆర్టీసీ డ్రైవర్లు నాలుగు రోజులు చేసే డ్యూటీని గుంతల ఈ గుంతల రోడ్డు వల్ల అలసిపోయి రెండు రోజులే చేస్తునారు. గుంతలకు మరమ్మత్తులు చేపడితే బస్సులు పునరుద్ధరిస్తాం.


బస్సుల్లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



చుట్టుపక్కల గ్రామస్తులు అనునిత్యం ఈ గ్రామంలోని ఆలయానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు మార్గం గుంతలు ఏర్పడడంతో బస్సు సౌకర్యం లేక వారు నానా అవస్థలు పడుతు న్నారు. ఆర్అండ్‌బి అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు నిర్వహించాలి. ప్రజల అవసరార్థం ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలి.

- లక్ష్మీనారాయణ, షేర్కన్‌పల్లి మాజీ సర్పంచ్

ఆలయానికి వెళ్లలేకపోతున్నాం..



పలుగు పోచమ్మ తల్లి ఆలయ దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళుతాం. కానీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రస్తుతం తీవ్ర ఇబ్బం దులు పడుతున్నాం. ఇతర వాహనాలపై వెళ్దామన్నా రోడ్డు బాగాలేదని అటువైపు ప్రయివేటు వాహనాలు రావడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతుల చేపట్టి.. సమస్యను పరిష్కరించాలి.

- రాజుగౌడ్

ప్రశాంతంగా నిమజ్జనాలు జరిగేలా చూడాలి



నవతెలంగాణ-జహీరాబాద్

గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు కలిసి సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర సెట్విన్ సర్వీస్ చైర్మెన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. నిమజ్జనోత్సవం కోసం ప్రధాన రహదారులు, జహీరాబాద్ మండల కోత్తూరు నారింజ ప్రాజెక్ట్ సమీపంలో విద్యుత్ దీపాలకు సంభందించిన అంశాల గురించి అన్ని శాఖల అధికారులతో బుధవారం చర్చించార. అనంతరం పనులను పర్యవేక్షించారు. పూర్తి కానీ కొన్ని పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనోత్సవంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జనాలు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రడ్డి, విద్యుత్, ఆర్అండ్‌బి, పంచాయత్‌రాజ్ శాఖల అధికారులతో పాటు పార్లమెంట్ సీనియర్ నాయకులు డా.సిద్ధం.ఉజ్వల్‌రెడ్డి, సర్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కర్దాస్ మనోహర్,సర్వజనిక్ ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మెన్ మహన్కల్ సుభాష్ గుప్తా, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్,అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ తక్షణమే అమలు చేయాలి



నవతెలంగాణ-జోగిపేట

రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామనిమోసం చేశారని.. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో రుణాలు మాఫీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జోగిపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏకకాలంలో 2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పి ఆధార్, రేషన్, ఆన్లైన్ లో తప్పుల పేరిట కొర్రీలు పెడుతూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. రూ.2 లక్షలు మొత్తం మాఫీ చేసినట్టు ప్రభుత్వం, అధికారులు చెప్తున్నా.. నేటికీ మాఫీ కాలేదన్నారు. రైతులు ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇండ్లు కూలిన బాధితులకు కూడా తగిన న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఆందోల్ ఏరియా కన్వీనర్ డి. విద్యాసాగర్, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

25న హలో విద్యార్థి.. ఛలో హైదరాబాద్



నవతెలంగాణ-జోగిపేట

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న 25న హలో విద్యార్థి.. ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ తెలిపారు. బుధవారం ఆయన జోగిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఆశ్రమ పాఠశాలల్లో, కాలేజీ హాస్టల్లలో, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను, టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అందోల్ మండల్ కార్యదర్శి హరిప్రభ , మండల అధ్యక్షులు, ఉపేందర్ , నాయకులు, పృథ్వీరాజ్, సుమంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డు కూల్చివేత



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో గల సర్వేనెంబర్ 142 లో గతంలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి కేటాయించడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. అదే స్థలములో అక్రమంగా ఓ వ్యక్తి కబ్జా చేసి గుడిసె రేకుల షెడ్డు నిర్మాణం చేసుకున్నట్లు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రెవెన్యూ అధికారులు జెసిబి తో సహాయంతో కూల్చి వేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జ్ఞాన జ్యోతి మాట్లాడారు. చెరువుకుంటలలో ఉన్న శికం భూములను ప్రభుత్వ భూములను అక్రమంగా ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

గురువారం | 12 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరం

- జిల్లా విద్యాధికారి రాధాకిషన్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం అని, మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. బుధవారం ఎస్జీఫ్ క్రీడలలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హవేలి ఘనపూర్ నందు మండల స్థాయి క్రీడలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, మండల నోడల్ అధికారి మధుమోహన్, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, సత్యం, రాజశేఖర్, రాజేశం, అశోక్, దేవుల, రమేష్ మండలంలోని క్రీడా విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ.



నవతెలంగాణ-చిలిపిచెడ్

చిలిపిచేడ్ పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసుల నమోదు తప్పని సరిగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, ఎస్సై యాదగిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా బుధవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్థానిక మెదక్ ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. భారీ బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంచి పెడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

నవోదయలో ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు

నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాల యంలో ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీ నేడు జరుగుతాయని విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకులు ఉమాపతి రెడ్డి ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రానున్నారని తెలిపారు. వారు కార్యక్రమాన్ని తిలకించి న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ తెలియచేశారు. మన దేశ రాజధాని న్యూఢిల్లీలోని లోక్ సభలో జరిగే కార్యకలాపా లన్నిటిని ప్రతిబింబించే విధంగా ఈ యూత్ పార్లమెంట్ పోటీ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ పోటీలో సుమారు 55 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొననున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం, కొత్తగా నియమింపబడ్డ మంత్రుల పరిచయము, ప్రశ్నోత్తరాల కార్యక్రమము, సంతాప తీర్మానము, ముఖ్యమైన బిల్లులపై చర్చలు ఉంటాయని నిర్వాహకులు తెలియజేస్తున్నారు. వాడి వేడి చర్చలకు ఈ ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ వేదిక కానున్నదని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యకమాన్ని జయప్రదంగా నిర్వహించగలమన్న ఆశాభావాన్ని ప్రిన్సిపాల్ వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక కావడం పట్ల చాలా సంతోషంగా ఉన్నదని ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే కు విద్యార్థులు ఈనెల 9 తేదీన తూప్రాన్ లోని ఆర్నాల్డ్ స్కూల్లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో సెలెక్షన్ లో సుమారు 150 మంది విద్యార్థులు క్రీడాకారులు పాల్గొనగా అందులో హబ్సిపూర్ మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు 9వ తరగతి విద్యార్థులు రాహుల్ , నంద కిశోర్ , సంజయ్ లు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక అవడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి తెలిపారు .వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, ఇతర ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు. సెలెక్ట్ అయిన క్రీడాకారులు ఈనెల 13 నుంచి 15 వరకు హైదరాబాదులోని మౌలాలిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలో పాల్గొంటారని పీఈటీ తరుణ్ రాజ్ తెలిపారు.

కలసికట్టుగా పండుగలు చేసుకుంటే ఆనందంగా ఉంటుంది

- చేర్యాల సీఐ ఎల్.శ్రీను



నవతెలంగాణ-చేర్యాల

అందరూ కలిసికట్టుగా పండుగలు .చేసుకుంటే ఆనందంగా ఉంటుందని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులకు నిమజ్జనం సందర్భంగా మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పీ. నీరీష్ తో కలిసి సీఐ శ్రీను మాట్లాడుతూ ప్రశాంతమైన శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో సాంప్రదాయ బద్ధంగా భక్తి పాటలు పాడుకుంటూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఊరేగింపు సమయంలో బాణాసంచ కాల్చవద్దని, డీజే లకు అనుమతి లేదన్నారు. భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పోలీసుల సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని ఆర్గనైజర్లకు సూచించారు. చెరువులు నిండడం వల్ల అందరూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు.

పోగొట్టున్న ఫోన్‌ను గుర్తించి బాధితునికి అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-జగదేవపూర్

పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను జగదేవపూర్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి అందజేశారు. జగదేవపూర్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం చేబర్తి గ్రామానికి చెందిన కంటకొమ్ము వెంకటేష్ గత 15 రోజుల క్రితం తన వివో సెల్ ఫోను ను ఇటిక్యాల గ్రామంలో పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు జగదేవ్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సాంకేతిక విభాగం కి చేందిన కానిస్టేబుల్ గునిశెట్టి రమేష్ సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్) పోర్టల్ లో సెల్ ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. ఫోను స్వాధీన పరచుకున్న తర్వాత బాధితున్ని పోలీస్ స్టేషన్ కి పిలిపించి సెల్ ఫోన్ ను అందజేశారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫోన్, ఇతర వివరాలు సిఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు .

కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారిన వేళ

- పాఠాలు బోధించి విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించిన కలెక్టర్
- సీజనల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా అప్రమత్తంగా ఉండాలి
- పీహెచ్‌సీ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి
- కస్తూరిబా గాంధీ విద్యాలయం, ఆయుష్మాన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా పరిశీలించిన
- కలెక్టర్ రాహుల్ రాజ్









నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట కస్తూర్బా గాంధీ విద్యాలయం అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, ఆరోగ్య కేంద్రంలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కస్తూర్బా విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పాపన్నపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో గదులను, స్టాక్ రూమ్‌ను, వంటలను కలెక్టర్ పరిశీలించారు. స్వయంగా కలెక్టర్ పాఠాలు బోధించి విద్యార్థినుల సామర్థ్యాలను విద్యా బోధనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాలయ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయ మరింత బలోపేతం చేస్తుందని విద్యార్థినులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ప్లాంట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ రక్షిత మంచినీరు అందించాలన్నారు. సకాలంలో సిలబస్‌ను పూర్తిచేసి ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. టాయిలెట్స్‌ను పరిశీలించి వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాణ్యమైన మెనూ అందించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సీజనల్ వ్యాధులు ప్రభల కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, జ్వరమే కదా అని అశ్రద్ధ తగదు అన్నారు. రక్త నమూనాలను అందజేసి పరీక్షలు తెప్పించుకోవాలని అందుకు తగినట్లుగా వైద్యం పొందాలన్నారు. డాక్టర్‌లు ప్రతి పేషంట్‌కు కె షీట్‌ను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలని, ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వార్డును సందర్శించి పేషంట్‌లతో మాట్లాడారు. అధికారులు గ్రామాలలో పర్యటిస్తున్నారని పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

మెడికల్ కాలేజీ మంజూరు చేస్తూ అనుమతులు రావడం శుభ పరిణామం

- మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ మెడికల్ కళాశాల మంజూరి సందర్భంగా పిళ్ళికొట్టాలలో ఉన్న తాత్కాలిక మెడికల్ కళాశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి బుధవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పరిశీలించారు అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం పక్కన నిర్మించనున్న శాశ్వత మెడికల్ కాలేజీ భవన నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే రోహిత్ రావు జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏ బ్లాక్, సి బ్లాక్ భవనాలను, సమకూర్చిన, ఫర్నిచర్, పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే మెడికల్ కాలేజీ మంజూరు అయిందన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్ష నెరవేరిన వేళ వైద్య విద్యకు న్యాయం చేసిన వేళ జిల్లాలో యువత ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లుగా తయారయ్యే వేళ ఎన్నో అవాంతరాల తర్వాత ఎట్టకేలకు మెదక్ మెడికల్ కాలేజ్ మంజూరి చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు జిల్లా కలెక్టర్‌కు, అధికారులకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కృతజ్ఞతలు తెలిపారు. నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా అభివృద్ధికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం పిళ్ళికొటాలలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన మెడికల్ కళాశాల భూమిని శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ పరిశీలించి భవన నిర్మాణాలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా పునర్విభజనలో భాగంగా మెదక్ ప్రత్యేక జిల్లా అయినా కూడా అంత అభివృద్ధి చెందలేదని జిల్లా అభివృద్ధిలో విద్యా వైద్యం సౌకర్యాలు మెరుగు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. వైద్య కళాశాల మంజూరు కావడం దీని వెనక విశేష కృషి చేసిన జిల్లా మంత్రి, శాసనసభ్యులు, హెల్త్ సెక్రెటరీకి ధన్యవాదాలు తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యాధికారులు ఉండడం స్థానికంగా ఉండి పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలని వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న మెడికల్ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. అంతకుముందు మెదక్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు రాందాస్ చౌరస్తాలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి టపాసులు కాల్చి మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శివ దయాల్, తహశీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వార్డ్ కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వ అధికారులు , మెడికల్ కళాశాల సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా శక్తితో మహిళలు రాణించాలి

- డిఆర్‌డీఓ శ్రీనివాసరావు



నవతెలంగాణ-చేగుంట

మహిళ శక్తితో మహిళలు చిన్న చిన్న పరిశ్రమలు పెట్టి రాణించాలని డీఆర్‌డీఓ శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మడి చేగుంట మండలంలోని పోతాంశెట్టిపల్లి గ్రామంలో నా మొక్క నా బాధ్యత అనే స్పెషల్ ప్రోగ్రాంను రూ 1.33 వేలతో ప్రోగ్రాం ఏర్పాటు చేశామని జిల్లాలో మొట్టమొదటి ప్రోగ్రాంలో భాగంగా పోతాంశెట్టిపల్లి గ్రామంలో చేగుంట ఏపిఎం లక్ష్మీనరసమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిఆర్డిఓ శ్రీనివాసరావు హాజరై మహిళ శక్తి గురించి అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. అలాగే గొల్లపల్లి, జైత్రం తండా గ్రామాలలో మహిళా శక్తిలో భాగంగా కోడి పిల్లల యూనిట్ గ్రౌండింగ్ చేసి విజిట్ చేశారు. అనంతరం వివోఏలతో రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, మహిళ శక్తితో లోన్ సౌకర్యం పొంది చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్క మహిళ, ప్రతి కుటుంబంలో మొక్కలు నాటాలని, మన భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ప్రకాష్, ఏపీఎం లక్ష్మి నరసమ్మ, సీసీలు, వివో ఏలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుల రమేష్



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన ఆకుల రమేష్‌ను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ నాయకత్వానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏబీవీపీ బాగా ప్రముఖ్ గా కొన్ని సంవత్సరాలుగా విద్యారంగ సమస్యలపై ఎనలేని కృషి చేసి అలాగే తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నాయకునిగా ఎన్నో జైలు శిక్షలు అనుభవించి , అలాగే భారతీయ జనతా యువమోర్చ ఉమ్మడి రామయంపేట మండల అధ్యక్షునిగా ప్రజా సమస్యల పైన నిరంతరం పనిచేసినట్లు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ రఘునందన్ రావుకు , బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌కి అలాగే కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైండ్ల సత్తన్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు సిహెచ్ శ్రీనివాస్ కి ఎంఎల్ఎన్ రెడ్డి కి బిజెపి సీనియర్ నాయకులు వెల్మల సిద్ధరాములుకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్ గౌడ్‌కు జిల్లా ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్ కి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెలుముల రమేష్‌కి సీనియర్ నాయకులకు అలాగే బిజెపి , జిల్లా రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న ప్రతి ఒక్కరు బదిలీపై వెళ్లి వేరే ప్రాంతంలో విధులు నిర్వహించడం సర్వసాధారణమని మండల విద్యాధికారి యాదగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గత కొన్ని ఏళ్లుగా విద్యార్థులకు విద్యా బోధన చేసిన మంజుల, కమల, నరసమ్మ, రేఖ, స్వరూప రాణ బదిలీపై వెళ్లడం ఎస్ఓ అధికారి ఫాతిమా బాధాకరమన్నారు. ఇన్నేళ్లుగా ఒకే గదిలో ఉండి ఒకే మాటపై ఉండి విధి నిర్వహణలో ఎలాంటి ఆటంకం ఉండకుండా విద్యార్థులకు చక్కని విద్యా బోధన చేసి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. విద్యార్థులకు ఇప్పటివరకు విద్యా బోధన చేసి బదిలీపై వెళు తున్న ఉపాధ్యాయులపై మమకారంతో కన్నీళ్లు పెట్టుకు న్నారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎఫ్ఏఓ విజయలక్ష్మి జి సి బి సి సుకన్య మాట్లాడారు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన విద్యార్థుల మనసులో మాత్రం చిరస్థాయిగా మిగిలిపోతారని గుర్తు చేశారు. ఇప్పటివరకు చేసిన పాఠ్య బోధనలను విద్యార్థులు ఇన్స్పిరేషన్గా తీసుకొని గుర్తుంచుకుంటారన్నారు. కస్తూర్బా పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి చక్కటి క్రమశిక్షణ పద్ధతిలో మెరుగైన విద్యలో ఉంటారని మరోసారి గుర్తు చేశారు. పాఠశాలకే ఒక గుర్తింపు తెచ్చిన ఫిజికల్ డైరెక్టర్ కమల బదిలీపై వెళ్లడం పాఠశాలకే తీరని లోటు అని విద్యార్థులు ఉపాధ్యాయులు కళ్ళు చెమ్మగిల్లి విధంగా బాధపడ్డారు. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు

ప్రత్యేక అర్చనలతో గణేశునికి ఘన పూజలు



నవతెలంగాణ- కొల్చారం

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేష్‌కు ప్రత్యేక అర్చనలతో వేద పండితులు ఘన పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం కొల్చారం మండల వ్యాప్తంగా ప్రతిష్టించిన గణనాథుల మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలతో పాటు భజనలు, కోలాటాలు అంబరాన్ని అంటుతున్నాయి. పైతర గ్రామంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రతిష్టించిన వినాయకునికి ఆలయ పూజారి కృష్ణ త్రిపాఠి వేదమంత్రోచ్చరణల మధ్య హారతి నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు వినాయకునికి నైవేద్యం సమర్పిస్తూ ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో వినాయక మండప నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మ నాన్నలు లేని అనాధలు.

- ఆదుకోవాలని వేడుకోలు- గ్రామ యువకులు
- కన్నీళ్ల పర్యంతమవుతున్న గ్రామస్తులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెందిన చెరివిరాల సుప్రియ, సుమశ్రీలు ఇద్దరూ ఆడ పిల్లలు అమ్మ నాన్నలు లేక అనాధలుగా మిగిలారు. కరోనా సమయంలో కరోనా బారిన పడి అమ్మ చనిపోయిందని, దాదాపు నెల రోజుల క్రితం తాత చనిపోయాడని తాత చనిపోయిన వారం రోజులకు నాన్న చనిపోయాడని ఆడపిల్లలు రోదిస్తూ తెలిపారు. వారు మాట్లాడుతూ మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని భూములు ఇండ్లు లేవని, ఉన్న ఇల్లు కూడా కూలిపోయే స్థితిలో ఉన్నదన్నారు . వారి రోదనలు చూసి గ్రామ యువకులు ముందుకు వచ్చి , దాదాపు 63,500 రూపాయలను వారికి అందజేయడం జరిగింది , గ్రామ యువకులు మాట్లాడుతూ అమ్మానాన్నలు లేని అనాధ ఆడబిడ్డలకు ఎవరైనా దాతలు ముందుకు వచ్చి వారికి తోచిన విధంగా సహాయం చేయాలని కోరుతున్నామన్నారు . ఇటువంటి కష్టాలు పగవాడికి కూడా రాకూడదని కోరుతున్నామని యువకులు తెలిపారు వారికి గూగుల్ పే కానీ ఫోన్ పే కానీ చేయాలనుకునేవారు 9866335444 నెంబర్‌కు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో. పప్పుల సిద్ధరాంరెడ్డి, జిపి స్వామి, బట్ట మహేష్, చలిమేటి ప్రసాద్ ,పంజా బాబు, వడ్ల నాగరాజు, గేరిగంటి బాబు, ఘట్కు శ్రీనివాస్, బండారి చింటూ, పవన్, ప్రశాంత్, మ్యాదరి మధు, తదితరులు పాల్గొన్నారు

గ్రామపంచాయతీ భారాన్ని మోయలేం

- ఎంపీ ఓ కరిముల్లా దగ్గర డిజిటల్ కీలు



నవతెలంగాణ- కౌడిపల్లి

గ్రామపంచాయతీ భారాన్ని మోయలేమని గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో శ్రీనివాస్‌కు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. గ్రామాలలో పారిశుద్ధ సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవో తెలిపారు. మురికి కాలువలు, రోడ్లు, మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామపంచాయతీని మేము భరించలేక పోతున్నామని వారు సమావేశంలో వాపోయారు. స్పెషల్ ఆఫీసర్ల దగ్గర ఉండాల్సిన డిజిటల్ కీ లు ఎంపీఓ కరిముల్లా దగ్గర పెట్టుకొని తమను గ్రామపంచాయతీలో పెట్టుబడి పెట్టాలని వేధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చెందారు. రోజువారీగా చెత్త తీయడానికి ట్రాక్టర్‌లో డీజిల్ పోయలేకపోతున్నామని తెలిపారు. ఈ విషయమై ఎంపీ ఓ కరిముల్లా వివరణ కోరగా ఇటీవల కొంతమంది స్పెషల్ ఆఫీసర్లు బదిలీపై వెళ్లడంతో డిజిటల్ కీ లను ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నాయని తెలిపారు.

బీసీజీ ఆన్ లైన్ సర్వే ఆశ వర్కర్లతో చేయించొద్దు

సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ

నవ తెలంగాణ-మెదక్ టౌన్

బీసీజీ ఆన్‌లైన్ సర్వే ఆశా వర్కర్లతో చేయించొద్దని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ డిఎంహెచ్ఓ కార్యాలయంలోని ఏఓ నవీన్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి కే.నర్సమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్స్‌తో రిజిస్టర్ సర్వేతో పాటుగా ఆన్‌లైన్ సర్వే చేయాలని ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, డాక్టర్లు ఆశ వర్కర్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే రిజిస్టర్ లో పేర్లు రాయడం చేస్తున్నారన్నారు. అయినా ఆశలతో ఆన్‌లైన్‌లో సర్వే ఎక్కించాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో సర్వే ఎక్కించడం ఆశాలందరికీ సాధ్యం కాదన్నారు. ఫోన్ ద్వారా ఆన్ లైన్ సర్వే చేయడం అందరికీ రాదన్నారు. అలాగే ఆశ వర్కర్లకు నెలకు 2 ఏఎంసిలు తేవాలంటున్నారన్నారు. ఈ విషయాన్ని ఇంతకుముందు కూడా డిఎంహెచ్ఓ దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. అయినా మళ్లీ పిహెచ్ సిలలో ఆశలతోనే ఆన్‌లైన్ సర్వే చేయించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. స్కూటమి క్యాంపులు నిర్వహించి శాంపుల్స్ తీసుకోవాలన్నారు. స్కూటమి డబ్బాలు ఆశాలతో తెప్పించరాదన్నారు. కానీ ఆశాలకు అదనపు పని ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆశల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు గంగమణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



సొసైటీలో విచారణ చేపట్టిన జిల్లా సొసైటీ సీనియర్ ఇన్స్పెక్టర్



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయ సీనియర్ ఇన్స్పెక్టర్ సంగమేశ్వర్ బుధవారం విచారణ చేపట్టారు. ఇదే సొసైటీలో చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రైతు చింతకాయల విట్టల్ వ్యవసాయ క్రాప్‌లోన్ రూ,35 వేలు తీసుకోగా మరింత లోను అవసరమై రూ.50 వేలు వ్యవసాయ అవసరాలకు తీసుకున్నాడు. మొత్తం రూ.85 వేలు అప్పు ఉంటే, రైతుకు రుణమాఫీ రాకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయ సీనియర్ ఇన్స్పెక్టర్ సంగమేశ్వర్ రెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో విచారణ చేపట్టారు. సమగ్ర విచారణ చేపట్టి త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జాగ్రత్తగా మాట్లాడు

- కాంగ్రెస్ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్



నవతెలంగాణ-తూప్రాన్

తెలంగాణ రాష్ట్రంలో నాడు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి నుంచే చీరలు, గాజుల సంస్కృతి మొదలవ్వాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు గాజులు,చీరలు వేసుకోవాలన్న కౌశిక్ రెడ్డి మాటలపై బుడ్డ భాగ్యరాజ్ ఘాటుగా స్పందించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భార్యను, కూతుర్ని అడ్డుపెట్టుకొని కౌశిక్ రెడ్డి శవ యాత్ర రాజకీయం చేసి గెలిచి, ఇతర ఎమ్మెల్యేల గురించి మాట్లాడేది లేదన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వం 39 మంది ఇతర ఎమ్మెల్యేలను అంగట్లో పశువుల్లాగా కొన్నందుకు ముందు, కేటీఆర్, హరీష్ రావులకు తెలివి లేదా అని విమర్శించారు. గాజులు, చీరల సంస్కృతి హుజురాబాద్ నియోజకవర్గం నుంచి ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారని, అందుకు కౌశిక్ రెడ్డి సిద్ధంగా ఉండాలని బుడ్డ భాగ్యారాజ్ విమర్శించారు.

మెదక్-మెటల్ కుంట రోడ్డుపై వివరాలు కోరిన కేంద్రం



నవతెలంగాణ-పావన్నపేట

మెదక్-మెటలుంట రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలన్న డిమాండ్‌కు స్పందన లభించిందని జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ జోగినాథ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ నుంచి బొడ్మాట్ పల్లి వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో పాటు కేంద్ర భవన్ రావణ శాఖ మంత్రి నితిన్ గడ్కరి కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయం నుంచి తనకు ఫోన్ వచ్చిందని ఈ రహదారిని రహదారిగా మార్చేందుకు అవసరమైన వివరాలు ఇవ్వాల్సిందిగా కేంద్ర భవన్ రవాణ శాఖ రీజినల్ ఆఫీసర్ క్రిష్ణ ప్రసాద్, రాష్ట్ర నేషనలైవే ఎన్సీకి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. రోడ్డు నిర్మాణంతో ఏడుపాయల దుర్గాభవాని, మెదక్ చర్చి, ఝరాసంగం ఆలయం, జహిరాబాద్ హైటెక్ సిటీతోపాటు కర్ణాటక రాష్ట్రం అనుసంధానం ఏర్పడుతుందని చెప్పారు. ఇందుకు సహకరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సంజయ్, రాష్ట్ర మంత్రి దామోదర్ రాజ నర్సింహ, ఎంపీలు రఘు నందన్‌రావు, సురేశ్ షెట్కార్, మాజీ ఎంపీ బీబీపాటిల్‌కు జోగినాథ్ ధన్యవాదాలు తెలిపారు.

టీజీయూడబ్ల్యూఈ లోకి భారీగా చేరికలు

- టీజీయూడబ్ల్యూఈ లో చేరిన కార్మికులు



నవతెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట సర్కిల్ గజ్వేల్

డివిజన్ టీజీయూడబ్ల్యూఈ, సీఐటీయూ అనుబంధం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, కంపెనీ అధ్యక్షులు సింగిరెడ్డి చంద్రారెడ్డి సమక్షంలో 327,టీఆర్‌వీకేఎస్ యూనియన్ నుంచి భారీ సంఖ్యలో కార్మికుల చేరారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ 327, టీఆర్‌వీకేఎస్ నుంచి వీరేశం, నాగరాజు, సతీష్, యాదగిరి, మల్లేషములు చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానం పలికినట్లు వారు తెలిపారు. రోజురోజుకు సీఐటీయూ అనుబంధమైన టీజీయూడబ్ల్యూఈ బలోపేతం అవుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీయూడబ్ల్యూ సీ ఐ టీ యూ అనుబంధం రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ గుంటుపల్లి సధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పరశురాములు, జాయింట్ సెక్రెటరీ రవికుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ యాదగిరి యాదవ్, మరాఠీ కృష్ణమూర్తి, డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పౌష్టికాహారాన్ని అందరూ తీసుకోవాలి

- గూడెంలో ఘనంగా పోషణ మాసం వారోత్సవాలు



నవతెలంగాణ-బెజ్జంకి

అంగన్వాడీ కేంద్రాలు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగారాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గూడెం అంగన్వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు కవ్వంపల్లి సరోజన ఆధ్వర్యంలో పోషణ మాసం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలతో నాగారాణి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. పంచాయితీ కార్యదర్శి లావణ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ రెడ్డి, మహిళలు హాజరయ్యారు.

గర్భవతులు, బాలింతలు బలమైన ఆహారం తీసుకోవాలి



నవతెలంగాణ-తొగుట

గర్భవతులు, బాలింతలు బలమైన పోషక ఆహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లు సూచించారు. బుధవారం తొగుట సెక్టార్ పరిధిలోని బండారు పల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషక మసోత్సవాల సందర్భంగా పోషక ఆహారం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోషక మసోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గర్భవతులు, బాలంతలు బలమైన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని చెప్పారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషక ఆహారం అందిస్తారని సూచిం చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సుపర్వేజర్ తారా, అంగన్వాడీ సుపర్వేజర్ అమ్ములు, అంగన్వాడీ టీచర్స్ రాణమ్మ, రేణుక, ఏఎన్‌ఎం కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి అశ్విని, ఆశా కార్యకర్త కవిత, గర్భిణీలు, బాలంతలు, తదితరులు ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియామకమైన మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వాటర్స్ యందు మండల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అక్కిరవేణి పోచయ్య, టీపీసీసీ నాయకుడు రాసూరి మల్లికార్జున్, మానకొండూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి చిన్నారెడ్డి మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డీఐఈఓ రవీందర్ రెడ్డి సూచన



నవతెలంగాణ-బెజ్జంకి

ఇంటర్ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఐఈఓ రవీందర్ రెడ్డి భోధన సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ రవీందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఇంటర్ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేల భోధన సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ప్రిన్సిపాల్ దేవ స్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్‌ను కలిసిన రేఖా గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్

గౌడ సంఘం మహిళ నాయకురాలు రాష్ట్ర మోకు దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖాగౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు నర్సింలు గౌడ్ తో కలిసి బుధవారం హైదరాబాద్‌లో బీసీ కార్పొరేషన్ చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గౌడ సమాజం అభివృద్ధి కోసం శ్రీకాంత్ గౌడ్ సహాయ సహకారాలు తీసుకుంటూ, గౌడ సంఘం నాయకుల సూచనల మేరకు గౌడ సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన బిక్షపతి



నవతెలంగాణ-సిద్దిపేట

టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు చెప్పినట్లు కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు కొలిమి బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాస అంజయ్య, తడకపల్లి పరుశరాములు, మిట్టపల్లి భూమయ్య, బూరుగుపల్లి కనకయ్య బక్రీ చెప్పాలా రవి, బాబు, పెంబర్ల మల్లేశం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్‌కు ఘన సన్మానం



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం వారి కార్యాలయంలో లయన్ నంగునూరు సత్యనారాయణ, దొంతుల సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంత ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ఫారెస్ట్ ప్రాంతం ఆక్రమణకు గురికాకుండా చూస్తూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

అటవీ సంరక్షణలో అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం

- జిల్లా అటవీ శాఖ అధికారి కే శ్రీనివాస్

నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం బుధవారం అటవీ సంరక్షణలో భాగంగా అమరులైన అమరవీరులకు జిల్లాలోని అటవీ శాఖ సిబ్బంది నివాళులు అర్పించడం జరిగింది. ఇందులో భాగంగా మన ఉమ్మడి మెదక్ జిల్లాలో 2010 ఏడాదిలో కీ.శే. డి.శివలాల్, ఫారెస్ట్ బీటు అధికారి అమరుడైనాడు. రాష్ట్ర వ్యాప్తంగా గత నలభై ఏళ్లల్లో 22 మంది అమరులైనారు. ఈ జిల్లా అటవీ అధికారి కె.శ్రీనివాస్ ఐ.ఎఫ్.ఎస్, తేజోవనం అర్బన్ పార్కులో నివాళులు అర్పించారు.

రక్త దాతలకు పలువురి అభినందనలు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గోవిందారం సంతోష్, రేకులపల్లి మల్లారెడ్డిలు రక్తదానం చేయడంతో పలువురు అభినందనలు తెలియజేశారు. సిద్దిపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన వ్యక్తి కి రక్త కణాలు తక్కువైనాయని నా మిత్రుడు చెప్పాడని బీఆర్ఎస్ నాయకులు ఆనగోని పర్శరాములు గౌడ్ తెలిపారు. రక్తము అవసరం అని చెప్పగానే సమయానికి వచ్చి రక్తదానం చేసిన ఆత్మీయ మిత్రులు గోవిందారం సంతోష్, రేకులపల్లి మల్లారెడ్డిలను అభినందించారు. ఆపద సమయంలో ఇలాంటి సహాయం అందించినందుకు ధన్యావాదాలు తెలియజేశారు.


మహిళా సభ్యులకు పెరటి కోళ్ల పంపిణీ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో గ్రామ సంఘాల్లో గల మహిళా సభ్యులకు పెరటి కోళ్లను దుద్దెడలో బుధవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. మండలం మొత్తం గ్రామాలకు కలిసి 2500 కోడి పిల్లల్ని పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆరు వారాల కోడి పిల్లకు రూ.105 చొప్పున లబ్ధిదారులు మహిళా సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాగ్దుం అలీ, సీసీలు, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

ఆకస్మిక మరణం సాహిత్య లోకానికి తీరనిలోటు



నవతెలంగాణ-సిద్దిపేట

పద్య సాహిత్యంలో ఎంతగానో కృషి చేసి, అందమైన అక్షరాలతో ప్రతినిత్యం సమాజాన్ని మేల్కొల్పుతున్న రచయిత డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ మరణం సాహితీ రంగానికి తీరని లోటని జాతీయ సాహిత్య పరిషత్, కృష్ణం వందేజగద్గురు రచయితలు అన్నారు. కామారెడ్డికి చెందిన నటేశ్వరశర్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. నటేశ్వరశర్మ సిద్దిపేటలో జరిగిన ఎన్నో సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం దాశరథి అవార్డును అందించింది. ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన వేదికపై పద్యాలను పాడి అలరించారు. పద్య సాహిత్యానికి ఎంతగానో కృషి చేసిన నటేశ్వరశర్మ మరణం తీరని లోటని సిద్దిపేట కవులు ఐతా చంద్రయ్య, ఎన్నవెల్లి రాజమౌళి, ఉండ్రాల రాజేశం, అన్నారు.

విస్తరించినా..ఇరుకు ఇరుకే..

- మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై వాహనాల నిలుపుదల
- ప్రమాదకరంగా మారిన రోడ్డుపై ఇసుక నిల్వ
- త్వరితగతిన తొలగించేల అధికారులు శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి





నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో ప్రధానమైన రోడ్లను అక్రమించి పలువురు వ్యాపారులు వివిధ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పోటీపడి వ్యాపారాన్ని రోడ్డుపైకి తీసుకువస్తున్నారు. అయా వాణిజ్య వ్యాపార దుకాణాల సముదాయాల వద్ద నిలుపాల్సిన వాహనాలను రోడ్డు మీద నిలుపాల్సిన పరిస్థితి నెలకొంది. విస్తారంగా విస్తరించిన రోడ్లు ఇరుకుగా మారి పాదచారుల, వాహనదారుల ప్రయాణానికి పూర్తిగా అంతరాయం ఏర్పడుతూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్రద్ధ చూపి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నెలల తరబడి ఇసుక నిల్వ..

మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణం వద్ద స్థానికుడు ఇంటి నిర్మాణం కోసం నెలల తరబడి ఇసుక నిల్వ చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక నిల్వ చేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయి.

పట్టించుకోని అధికారులు..

స్థానికులతో పాటు మండల పరిధిలోని అయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి ఏదో ఒక పని నిమిత్తం వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ట్రాఫికును నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు నిత్యం రోడ్లపై నరకం చూస్తున్నారు. పోలీసుల వాహనాలు సైరన్ వేసుకుంటూ అనేకసార్లు అటు,ఇటుగా వెళ్లడమే తప్ప రోడ్డుపై ఏర్పడుతున్న పార్కింగును తొలగించడంలో శ్రద్ధ చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నియంత్రణ లేకుండా వాహనాలు ఇష్టానుసారంగా వెళ్తుండంతో పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు పలు సెంటర్లలో కావలికాస్తూ వాహనదారులకు మాత్రం జరిమానాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎంపీడీఓ జరిమాన...

గత కొద్దేండ్ల క్రితం స్థానికుడు ఇంటి నిర్మాణం కోసం ఒక ప్రక్క రోడ్డుపై నిర్మాణ సామాగ్రి ఏర్పాటు చేసుకుంటే ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన రాఘవేందర్ రెడ్డి గృహ నిర్మాణదారుడికి జరిమాన విధించారు. గత కొద్ది నెలలుగా బస్టాండ్ చౌరస్తాలో రోడ్డుపై యథేచ్ఛగా ఇసుక నిల్వ చేసిన నిర్మాణదారునిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకరంగా మారిన ఇసుక నిల్వను తొలగించి సమన్యాయం పాటించాలని స్థానికులు వాపోతున్నారు.

సమస్య పరిష్కరించాలి..

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధాన సెంటర్లలో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. నిబంధనలు పాటించని వ్యాపారస్తులు, వాహనదారులపై అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై సమస్యల్లేకుండా చూడాలి.

సమస్య పరిష్కరించాలి..

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధాన సెంటర్లలో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. నిబంధనలు పాటించని వ్యాపారస్తులు, వాహనదారులపై అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై సమస్యల్లేకుండా చూడాలి.

-స్థానికులు, బెజ్జంకి

. నోటీసులిచ్చాం..ఇసుకను స్వాధీనం చేసుకుంటాం

నోటీసులిచ్చాం..ఇసుకను స్వాధీనం చేసుకుంటాం

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై వాహనాలు నిలిపే వాహనదారులపై, రోడ్డును అక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుని జరిమానాలు వేస్తాం. రోడ్డుపై ఇసుక నిల్వ చేసిన ఇంటి నిర్మాణదారునికి నోటీసులు జారీ చేశాం.అతిక్రమిస్తే రోడ్డుపై ఇసుకను స్వాధీనం చేసుకుంటాం.

-ప్రనీత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బెజ్జంకి.

ఆర్అండ్ఆర్ కాలనీల పనులపై పూర్తి వివరాలు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ- సిద్దిపట కలెక్టరేట్

ఆర్అండ్ఆర్ కాలనీల పూర్తి వివరాలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి సిద్దిపేట, గజ్వేల్ డివిజనుల్లో గల ఆర్ అండ్ ఆర్ కాలనీలలో సౌకర్యాలు, ఆయా కాలనీలలో ఉంటున్న వారి వివరాలు పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాలనీల్లో నిర్మించిన ఇండ్లు, కేటాయించిన లబ్ధిదారులు, ప్రస్తుతం ఆయా ఇండ్లలో ఉంటున్న వారి వివరాలు, అలాట్ చేయని ఫ్లాట్స్ తదితర పూర్తి వివరాలతో మ్యాపింగ్ చేసి ఈ నెలాఖరులోగా అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కాలనీల్లో చేపట్టిన త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజ్, హెల్త్ సెంటర్, పాఠశాలలలు, వైకుంఠధామాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ఉండాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్, సిద్దిపేట ఆర్డీవోలు బన్సీలాల్, సదానందం, పంచాయ ఎతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఈఈడబ్ల్యూఐడిసి, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో లాభం



నవతెలంగాణ-మర్కుక్

భారత వంటనూనె పరిశ్రమ అమెరికా, చైనా, బ్రెజిల్ తర్వాత నాలుగవ అతిపెద్ద పరిశ్రమ, పామాయిల్‌ను బేకరీ ఉత్పత్తుల, తయారీకి గృహ అవసరాలకు వినియోగిస్తారని మర్కుక్ మండల వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో రైతు మిట్టపల్లి రాజి రెడ్డి ఆయిల్ ఫామ్ క్షేత్రంలో పరపరాగ సంపర్కము ఉపయోగపడే పురుగులను వదలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూల గుత్తులను తీయు విధానం పై రైతు అవగాహన కల్పించారు. ఒక ఎకరా వరి సాగుకు అవసరమైన నీటితో 4 ఎకరాల పామాయిల్ పంటను సాగు చేయవచ్చని తెలియజేశారు. రైతులు నీటి యాజమాన్యం ఎరువుల యాజమాన్యం, పురుగుల యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. వాతావరణాన్ని బట్టి మొక్కల పాదులలో తగినంత తేమ ఉండేలా నీరు అందించాలని నీటి కొరత వలన ఆకుల ఉత్పత్తి తగ్గి పెరుగుదల సన్నగిల్లి తదుపరి కాలంలో ఎక్కువ మగ పుష్పాలు వచ్చి తద్వారా దిగుబడి తగ్గిపోతుందని సూచించారు. ఆయిల్ పామ్ చెట్టు నాటిన 14 నెలల నుంచి పూతకు వస్తాయని చెట్టు తొలి దశలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది నీరు పోషకాలు గ్రహించి చెట్టు బాగా పెరగాలంటే ఈ పూలగుతులను వెంటనే తుంచివేయాలని సూచించారు. ఈ పుగుత్తులను మొక్క నాటిన నుంచి 30 నెలలు వచ్చేంతవరకు తీసివేస్తూ ఉండాలన్నారు. సాగుకు నీళ్లు సమృద్ధిగా ఉండాలి రోజుకు ఒక మొక్కకు దాదాపు 200 లీ. నీరు అవసరం అవుతుందని,ఆయిల్ పామ్ సాగు చేసే రైతుకు ప్రతి 15 రోజులకోసారి డబ్బులు చేతికొస్తాయన్నారు. ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత ఒక్కో చెట్టు గెలలు ఒక్కోసారి పక్వానికి వస్తాయని, దీంతో ప్రతి 15 రోజులకోసారి గెలల్ని కోయాల్సి ఉంటుందన్నారు. వాటిని గంటల వ్యవధిలోనే కంపెనీకి చేర్చాలని, దీంతో దిగుబడికి తగ్గట్లు కంపెనీనే నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తుందన్నారు. దీంతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటలో మొక్కల మధ్య దూరం ఎక్కువ కనుక తొలి 3 సంవత్సరాల కాలంలో అంతర పంటలు పండించి రైతులు ఆదాయం పొందవచ్చునని తెలియజేశారు. 8 సంవత్సరాల తరువాత కోకో, మిరియాలు వంటి అంతర్ పంటలను సాగు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి సౌమ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణు వర్ధన్, రజనీకాంత్ విజయ్, రైతులు ,తదితరులున్నారు

మొక్కజొన్న పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలంలోని బందారం గ్రామంలో పలువురు రైతులకు చెందిన మొక్కజొన్న పంటలను శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన నీల క్రిష్టయ్యకు చెందిన మొక్కజొన్న పంటకు పురుగుమందులు వాడి నష్టం జరిగిందని ఆరోపించడంతో తోర్నాల వ్యవసాయ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్ పల్లవి వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కాండం తొలిచే పురుగు ఆశించడంతో దానికి సరైన పురుగుమందులు ఇవ్వకుండా పంట పెరుగుదలకు సంబంధించిన మందుల ఇవ్వడంతో పురుగుల ఉధృతి పెరిగి పంట పూర్తిగా నష్టం జరిగిందని తెలిపారు. అలాగే సరైన పురుగుమందులను వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు మేరకు మాత్రమే వాడాలని పురుగుమందుల దుకాణ యజమానులు ఇచ్చే వాటిని వాడి పంటకు పాడు చేసుకోవద్దని అలాగే అధిక మోతాదులో అనవసరమైన మందులు వాడితే పంట పెట్టుబడి పెరిగి రైతులకు నష్టాలు వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ ఏఈఓ సంధ్య పాల్గొన్నారు.

పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని పరిహారం చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఇటివల కురిసన వర్షాల వలన గజ్వేల్ డివిజన్ పరిధిలో పత్తిపంటలో వర్షం నీరు నిలిచి పంటనష్ట పోయిన రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రాథమిక అంచన ప్రకారం 5,366 ఎకరాలలో వరి 1762, పత్తి 1407, మక్కజొన్న 271 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు తెలిపారు. గజ్వేల్ ,జగదేవ్ పూర్ ,వర్గల్ ,మార్కుక్ ,ములుగు,తూప్రాన్ ,కొండపాక, కుకునూర్ పల్లి మండాలల్లో పకడ్బందీగా పంట నష్టపరిహారాన్ని నమోదు చేయడానికి వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశిలన చేసి పంటనష్టపరిహర నివేదికను ప్రభుత్వానికి అందించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. గజ్వేల్ మండల్ లో దాచారం గ్రామానికి చెందిన కర్రొళ్ళ స్వామి, అనంతరావు పల్లి గ్రామానికి చెందిన డి.0యాదయ్య, డి.సూదర్శన్, పైడి లక్ష్మీనర్సు, దొడ్డ నర్సింగరావు జాలిగామ గ్రామానికి చెందిన చిట్యాల రాములు, వర్గల్ మండల్ జబ్బాపూర్ గ్రామానికి చెందిన నాగిరెడ్డిపల్లి మల్లేశంకు సంబంధించిన పత్తి, మక్కజొన్న, వరి నష్టపోయినట్లు తమ దృష్టికి వచ్చిందని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం లో రైతులు మల్లేశం,రాములు పాల్గొన్నారు.

బాలికల కన్వెన్షన్ సభ విజయవంతం చేయండి

- గజ్వేల్ డివిజన్ ఎస్ఎఫ్ఐ నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ మండల కేంద్రమైన కొమరెల్లిలో నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కొంక ప్రణయ్, కోనేరు ప్రవీణ్ తెలిపారు. బుధవారం పట్టణంలో కన్వెన్షన్ కు సంబంధించిన కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20న, 21న, 22న తేదీల్లో నిర్వహిస్తామని వారు తెలిపారు. మహిళలు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారల మార్గాలను గురించి చర్చించామన్నారు. ఈ కన్వెన్షన్కు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల నుంచి300 పైగా విద్యార్థులు పాల్గొననున్నారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత గర్ల్స్ కన్వీనర్ దీపిస్తాదర్ ప్రొఫెసర్లు మహిళా మేధావులు పాల్గొననున్నారు. మొదటిరోజు విద్యార్థులతో ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అన్ని దాడుల జరిగిన సందర్భంల్లో మహిళలకు, ఎస్ఎఫ్ఐ అండగా నిలబడి పోరాటం చేసిందన్నారు. అన్ని విద్యార్థులు సంస్థల్లోనూ విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు గుర్తు చేశారు. ఈ సమస్యలపై కన్వెన్షన్ విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో. టౌన్ సెక్రెటరీ రాజశేఖర్ నాయకురాలు అనిత, అఖిల, శ్రావణి, వైష్ణవి పాల్గొనడం జరిగింది.

పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ - కొండపాక

పిల్లలు మానసికంగా ఆరోగ్యంగా చురుగ్గా ఎదగాలంటే మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందివ్వాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. కొండపాక మండలం మర్పడగ, కుకునూరు పల్లి, మెదినిపూర్ అంగన్ వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు గర్భిణీస్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పిల్లలు ఆరోగ్యంగా చురుగ్గా ఎదగాలంటే మెనూ ప్రకారం పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని అంగన్ వాడీ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా అంగన్ వాడీ భవనం చుట్టూ కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ చాలా ముఖ్యమైనదని పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పాడుతూ డ్యాన్స్ చేసిన రైమ్స్ ను చూసి జిల్లా కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి ఎల్లయ్య, సీడీపీఓ రమాదేవి, కొండపాక తహసీల్దార్ దిలీప్ , ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు

రంగు మారిన మిషన్ భగీరథ తాగునీరు

- సోషల్ మీడియాలో వైరల్ మారిన సంఘటన



నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపల్ పరిధిలో గత వారం రోజులుగా రంగు మారిన మిషన్ భగీరథ తాగునీరు సరఫరా అవుతుంది. గజ్వేల్ మండలం కోమటి బండ వద్ద ఏర్పాటుచేసిన వాటర్ గ్రిడ్డు నుంచి వర్షాల కారణంగా మిషన్ భగీరథ తాగునీరు రంగులు మారుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఈ పరిస్థితి వస్తుంది. అధికారులు మాత్రం వాటిని వేడి చేసుకుని చల్లారిన తర్వాత వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. అయితే బుధవారం సోషల్ మీడియాలో రంగు మారిన తాగునీరు వైరల్ గా మారింది. దీనిపై స్పందించిన అధికారులు పలు సూచనలు సలహాలు ప్రజలకు అందిస్తున్నారు. వర్షంతో వరద రావడంతో అక్కడనే నీటి ఫిల్టర్ చేసి ఇక్కడికి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ తాగునీరు వారం రోజులుగా బ్లూ, ఇతర రంగుల్లో మాదిరిగా వస్తుండడంతో ప్రజలు కొందరు అప్రమత్తమై వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. కొన్నిటికి వినియోగించుకుంటూ మిగతా వాటి కోసం వాటర్ ప్లాంట్ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గతంలో 20 లీటర్ల వాటర్ క్యాన్ నీటిని వాటర్ ప్లాంట్ల యజమానులు రూ.10 తీసుకోగా ఇప్పుడు రెట్టింపు చేసినట్లు పలువురు మహిళలు చర్చించుకోవడం కనిపించింది.

ప్రజలకు విజ్ఞప్తి.

మిషన్ భగీరథ డి ఈ.ఈ రాజు,

నీటి సరఫరా రంగు మారి వస్తుందని స్థానికంగా ప్రజలు వేడి చేసుకుని చల్లారిన తర్వాత వినియోగించుకోవాలన్నారు. గృహ అవసరాలకు వాడుకోవచ్చని వారు సూచించారు. వేడి చేసి చల్లార్చిన నీరు మాత్రమే త్రాగటానికి ఉపయోగించుకోవాలన్నారు. దీని నుంచి మున్సిపల్ తో పాటు గజ్వేల్, నర్సాపూర్, దుబ్బాక నియోజకవర్గంలకు సరఫరా అవుతున్నాయని ఆయన చెప్పారు. అక్కడ ప్రజలు కూడా తాము సూచించిన విధంగా పాటించాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏడీఏ



నవతెలంగాణ- రాయపోల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సస్య రక్షణ చర్యలు చేపట్టి పంటలు కాపాడుకోవాలని గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. పంట నష్టం జరిగిన రైతులు వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. నేలకొరిగిన మొక్కజొన్న పంటను లేపి జుడులు కట్టుకోవాలని తెలపటం జరిగింది. అదే విధంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ప్రత్తిలో ఎండు తెగులు వచ్చే అవకాశం ఉన్నది కావున ఎండు తేగులు గమనించి రైతులు కాపర్ ఆక్సీ క్లోరైడ్‌తో లీటరు నీటికి 3 గ్రాములు కలిపి ప్రతి పంట మొదలు తడిచే విధంగా డ్రెంచింగ్ చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి రజిత, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 10న సిద్దిపేటలో నిర్వహించిన 10వ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీ లు జరిగాయి. జిల్లాస్థాయిలో గట్ల మల్యాల ఉన్నత పాఠశాలకు చెందిన ఈశ్వరి, అను, వైష్ణవి, రోహిత్‌లు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 21 ,22, 23 తేదీలలో సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రమేశ్ తెలియజేశారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు దర్శనాల రాజ్ కుమార్‌లను అభినందించారు. విద్యార్థులను ఆప్ కమిటీ చైర్మెన్ సరోజన, ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

జీతాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల నిరసన



- వాయిదా పడ్డ కౌన్సిల్ సమావేశం

నవతెలంగాణ-దుబ్బాక

గత రెండేళ్లుగా తమకు జీతాలు చెల్లించడం లేదని, తమ కుటుంబాలు పస్తులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు దుబ్బాకలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం నిరసనకు దిగారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో కార్మికుల నిరసనతో సమావేశం వాయిదా పడింది. కార్మికులు ఆస భాగ్యలక్ష్మి, మంజుల, టీ.ప్రశాంత్ ఆస రాజు, ఎడ్ల లింగవ్వ, మాదుగుల లక్ష్మి, మాట్లాడుతూ. గతంలో మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన గణేష్ రెడ్డి సుమారు 16 మందిని పారిశుద్ధ కార్మికులుగా తీసుకోన్నా రన్నారు. ప్రభుత్వ బదిలీల్లో గణేష్ రెడ్డి స్థానంలో మున్సిపల్ కమిషనర్‌గా రమేష్ కుమార్ వచ్చాడన్నారు. గత రెండేళ్ళగా తమకు జీతాలు ఇవ్వకుండా అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన కమిషనర్ తనకి ఏం సంబంధం లేదంటూ కలెక్టర్ నుంచి అప్రూవల్ లెటర్ తెచ్చుకుంటేనే జీతాలు చెల్లిస్తానని చెప్తున్నాడని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తమకు రెండేళ్లుగా రావాల్సిన జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ను నవ తెలంగాణ వివరణ కోరగా స్పందించలేరు.

మట్టి గణపతులతోనే కాలుష్య నివారణ



- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి

నవతెలంగాణ-గజ్వేల్

మట్టి గణపతులతోనే కాలుష్య నివారణ జరుగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి అన్నారు. బుధవారం అయ్యప్ప నగర్ కాలనీలో మట్టి వినాయకుని ప్రతిష్టించారు. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. యువజన సంఘం సభ్యులు తీసుకున్న నిర్ణయం చాలా మంచిదని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో వచ్చే ఏడాది అంతా మట్టి గణపతిని ప్రతిష్టించి కాల్షియం నివారణకు వినాయక మండపం నిర్వాకులు కృషి చేయాలని ఆయన కోరారు. గత 20 ఏళ్లుగా గజ్వేల్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈసారి పర్యావరణంలో భాగంగా మట్టి గణపతులను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వమే చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు అభిషేక్, సాయి కృష్ణ, నాయిని బబ్లు, శివ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇండ్లను కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మండలం బల్వంతాపూర్ గ్రామంలో నిర్మించిన 20 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని విధాల ఆర్థికంగా ఉన్న అనర్హులే అక్రమంగా చొరబడ్డారని వెంటనే వారిని ఈనెల 13 లోగా ఖాళీ చేయించాలని గ్రామస్తులు పడిగే యాదయ్య, బొజ్జ సత్తయ్య, జంగిరి సత్తయ్య, యాదయ్య, కొంగరి స్వామి డిమాండ్ చేశారు. తమ గ్రామంలో అర్హులకే డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ బుధవారం సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎం.మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. బుధవారం దుబ్బాకలో వారు మాట్లాడారు. బల్వంతాపూర్ గ్రామస్తుల వినతికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. అర్హులను గుర్తించేందుకు త్వరలోనే ఎమ్మార్వో ను పంపించి గ్రామసభను నిర్వహిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. బల్వంతాపూర్ గ్రామస్తులు రెడ్డబోయిన రవి, రెడ్డబోయిన రాజు,ఎండీ నజీర్,కొంగరి కాంతు, బొజ్జ శ్రీనివాస్, కొంగరి స్వామి, యాదయ్య, సత్తయ్య, పలువురు ఉన్నారు.

శాంతి యుతంగా కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు



- మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన గణపతి మండపంలో బుధవారం మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, బీ ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు ఎన్ సీ సంతోష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్రి పూజల్లో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ గణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని ఆది దేవుడు గణపతిని పూజిస్తే అంతా మంచి జరుగుతుందని గణపతి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న అందరికి వినాయక అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం యువ నాయకుడు ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 5వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శేషం శ్రీనివాసచార్యులు, వెంకటేశ్వర దేవాలయం చైర్మెన్ బుక్క రమేష్, పెద్ద ఎత్తున 18వ వార్డ్ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ములుగు మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-ములుగు

బుధవారం ములుగు మండల శాఖ అధ్యక్షులు మొగిలి వెంకట నర్సింహారెడ్డి అధ్యక్షతన సిద్దిపేట జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు శశిధర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. పీఆర్టీయూ ములుగు మండల నూతన అధ్యక్షులుగా పూడూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా (ప్రాథమిక పాఠశాల ములుగు) బద్దం మనోహర్ రెడ్డి, (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సింగన్నగూడ)ఎన్నిక కాబడ్డారు. ఇట్టి మండల కమిటీలో అసోసియేట్ అధ్యక్షులుగా కె. శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి .గంగ రాములు, మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్.మాధవి కార్యదర్శులుగా కే.రమేష్,మహిళా కార్యదర్శిగా యం.కల్పన, ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారు. ఇటి కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎన్ .శ్రీనివాస్ రెడ్డి, ఏ .అమర్నాథ్ రావు, బి రంగారావు, రాష్ట్ర బాధ్యులు జె. శ్రీనివాస్ రెడ్డి, ఎన్ శ్రీనివాస్, ఏ.శ్రీనివాస్, ఎస్ .జ్యోతి, వీణమ్మ ఉన్నారు.

తుమ్మ గాలయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట: సిద్దిపేట చేనేత కుర వృద్ధుడు తుమ్మ గాలయ్య మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట చేనేత కుర వృద్ధుడుగా పేరుగాంచిన గాలయ్య మృతి బాధాకరమని, చేనేత వృత్తి కళాకారుడు ప్రస్తుతం ప్రచుర్యంలో ఉన్న గొల్లభామ చీరలు అత్యధికంగా తయారు చేస్తున్నటువంటి వ్యక్తిగా, మాస్టర్ వీవర్ గా పేరు తెచ్చుకున్న వ్యక్తి గాలయ్య అని అన్నారు. కనుమరుగైనటువంటి పట్టు పీతంబరాన్ని ఈ ఆధునిక ప్రపంచానికి కూడా గుర్తు చేశారని, పట్టుపితంబరాలు తయారు చేయడం లో దిట్ట అని, వీరి వద్ద ఎంతో మంది చేనేత వృత్తి ని నేర్చుకున్నారని, ప్రస్తుతం వీరి దగ్గర 25 మంది చేనేత వృత్తి కళాకారులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. భారతదేశంలో ఎక్కడ చేనేత ఎగ్జిబిషన్ జరిగిన సిద్దిపేట గాలయ్య స్టాల్ ఉంటుందనీ అన్నారు. వారి మృతి చేనేత కళారంగానికి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తా



- మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా సంక్షేమం కోసం పని చేస్తానని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్నారు. బుధవారం తనతో పాటు 1998-99 లో ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తూముకుంట నర్సారెడ్డి తనపై పెట్టిన బాధ్యతను ముందుకు తీసుకపోయి పార్టీకి ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని చెప్పారు. రైతు, ప్రజా సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోతానని ఆయన అన్నారు. నర్సారెడ్డి నాయకత్వంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందేలా ముందుండి పనిచేస్తానని ఆయన అన్నారు. తనతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు నన్ను ఘనంగా సన్మానించడం ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, బాల్య మిత్రులు, పాల్గొన్నారు.

అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలి



- చేర్యాల సీఐ ఎల్.శ్రీను

నవతెలంగాణ-చేర్యాల

అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించి వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను సూచించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా బుధవారం చేర్యాల పట్టణ శివారులో ఉన్న కుడి చెరువును మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్, తహసీల్దార్ సమీర్ హైమద్ ఖాన్, ఎస్ఐ నీరేష్, ఆర్ఐ రాజేందర్ రెడ్డితో కలిసి సీఐ శ్రీను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ నిమజ్జనం చేసే ప్రదేశంలో బారికేట్లు, లైటింగ్, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ అధికారుల సూచనలు, సలహాలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని కోరారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అన్నాడి మహేందర్‌రెడ్డిని బుధవారం పీఆర్‌టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశ అనంతరం మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా దర్శనాల నారాయణ, అసోసియేట్ అధ్యక్షులు కరివేద లింగారెడ్డి, పన్యాల లక్ష్మి, కార్యదర్శిగా నేదునూరి కనకయ్య, మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులుగా వ్యవహరించిన మల్లారెడ్డి, నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశబోయిన ఓదేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మ సురేందర్‌రెడ్డి, జగన్, అనిత, దామోదర్, వెంకన్న, బాల్‌రెడ్డి, కిషన్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీర బైరాన్ పల్లిలో జరిగే శౌర్య యాత్రను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరిస్తూ వీర బైరాన్ పల్లిలో సెప్టెంబర్ 14న జరిగే శౌర్య యాత్ర ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ ఆఫీసులో శౌర్య యాత్ర కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నైజాం రజాకార్లు, దొరలు, భూస్వాములు, జాగిందార్లకు వ్యతిరేకంగా బైరాన్ పల్లిలో వీరోచితమైన పోరాటం సాగిందని ఇది మరో జలియన్వాలా బాగ్ పోరాటంగా ప్రసిద్ధిగాంచిందని ఆ పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులను స్మరిస్తూ సెప్టెంబర్ 14న శౌర్య యాత్ర, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఆనాడు భూమి లేని నిరుపేదలకు భూములు కావాలని, దున్నేవానికి భూమి దక్కేల పోరాటం సాగిందన్నారు. కానీ నేటి పాలకులు ఈ చరిత్రను వక్రీకరించి ఆ పోరాటం హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం కోసం ప్రయత్నం చేస్తున్నారని దీనిని ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేటి కరణ చేయాలని ప్రయత్నిస్తుందని, రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా మోసం చేస్తుందని, బీజేపీ దేశంలో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ బడా కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగాన్ని కారు చౌకగా అమ్మేస్తుందని దీనికి వ్యతిరేకంగా తెలంగాణ అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరు, రవిందర్, నాయకులు తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, సార్ల యాదయ్య, నరసవ్వ, ఆరుట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు

ఉన్న రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేస్తారా...?

- గుంతల రోడ్ల పరిస్థితి మున్సిపల్ పాలకవర్గంకు పట్టదా.. ?
- బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్ల శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

ఉన్న రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేసి నిధులు నీటిపాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్ల శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పాత రోడ్లు ఉన్నప్పటికీ వాటిని తీసివేసి కొత్త రోడ్లు వేస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నడవలేని స్థితి ఉన్న వాటిని మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోకుండా ఇష్టసారంగా నిధులను నీళ్లపాలు చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు మున్సిపల్ పరిధిలో ఉన్న లక్ష్మీ ప్రసన్న నగర్ పరిస్థితిని పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. గతంలోని అనేకసార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారుల దృష్టికి తీసుకుపోయి వినతి పత్రం ఇచ్చిన పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. నిధులు ఉన్నాయని ఇష్టాసారంగా రోడ్లు వేస్తున్నారని ఆయన అన్నారు. సీసీ రోడ్లు వేయించాలని విజ్ఞప్తి చేసిన మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మిగతా కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిధులు మంజూరు చేసి మున్సిపల్ అభివృద్ధి చేయాలని చెప్పారు.

ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకిచ్చే ప్రతిపాదన విరమించుకోవాలి

- 18న ధర్నాలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలి
- జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్ప రవికుమార్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ ఈనెల 18వ తేదీన తలపెట్టిన చేలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోర్డు అడ్వైంట్ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమ కోసమే ఖర్చు చేయాలన్నారు. సిద్దిపేట జిల్లా బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ వర్క్ ర్స్ ఫెడరేషన్ సెంటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 18 వ తేదీన జరిగే ధర్నా చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మందికిపైగా భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులు వృత్తుల్లో పనులు చేస్తున్నారని, వీరంతా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలకు చెందిన పేదలని అన్నారు. 2009 నుంచి భవన నిర్మాణ కార్మికులకు 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్, పిల్లలకు స్కాలర్షిప్, గృహ వసతి, అడ్డాలలో మౌలిక సౌకర్యాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటైనప్పటి నుంచి కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంలో ఉన్న సంక్షేమ పథకాలకు నిధులు పెంచడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మిక సంక్షేమం కోసం ఖర్చు పెట్టకుండా.. దారి మళ్లించిందని, రాష్ట్రంలో 15 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి, మిగతా 10 లక్షల మంది కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించకుండా అన్యాయచేస్తోంది. కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చే ముందు కార్మిక సంఘాల నాయకులతో, మేధావులతో, అనుభవం కలిగిన నిపుణులతో చర్చించాలని డిమాండ్ చేశారు. 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు ద్వారానే నిధులను కార్మికులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పోతిరెడ్డి రాజు జిల్లా కమిటీ సభ్యులు బాల నరసయ్య, బాలకిషన్, మల్లేశం, రాజశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే హరీశ్ రావు రాజీనామా చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదనీ, హరీశ్ రావుకు దమ్ముంటే సవాల్ చేసిన ప్రకారం రాజీనామా చేయాలనీ కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి, స్టేట్ కో కన్వీనర్ నాయిని నర్సింహా రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్‌లు అన్నారు. కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శిలుగా మేడిపల్లి గ్రామానికి చెందిన పాకాల భూపతి రెడ్డి ,గజ్వేల్ నియోజవర్గనికి చెందిన కర్ణాకర్ లను నియమిస్తూ బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో నియామక పత్రాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరీశ్ రావు పోటీ చేస్తే, నిన్ను ఓడగొట్టే బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులుగా, కార్యకర్తలుగా మేము తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన విషయంలో దయ్యాలు వేదాలు వల్లించినట్లు హరీశ్ రావు మాట్లాడుతున్నాడని, రాజకీయ డ్రామాలు బంధుచేసి వెంటనే హరీశ్ రావు రాజీనామా చేయాలన్నారు. సిద్దిపేటలో ప్రతిపక్ష నాయకులపై అనేక కేసులు పెడుతూ, నయాన్నో, భయాన్నో పార్టీలోకి తీసుకుంటూ, నీవు ఎన్నికల్లో గేలిచావు తప్ప సిద్దిపేటకు చేసింది ఏమి లేదన్నారు. నూతనంగా నియామకం అయినా భూపతి రెడ్డి ,కర్ణకర్ లు మాట్లాడుతూ మాపై నమ్మకం తో మాకు పదవులు కట్టబెట్టిన వారికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యూత్ కాంగ్రెస్ మండల్ ప్రెసిడెంట్ జయంత్, మండల కార్యదర్శి కోరిమి రాజు, మహేందర్ , ప్రశాంత్, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బీజేపీ కుట్రా

- నిరసన దీక్షకు మద్దతుగా తరలిన మాలలు





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్ర ప్రభుత్వ బీజేపీ పార్టీ ఎస్సీ వర్గీకరణ పేరిట కులాల మధ్య చిచ్చుపెట్టి కుట్ర చేస్తుందని మాల మహానాడు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వెన్న రాజు ఆరోపించారు. బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సిద్దిపేటలో చేపట్టిన నిరసన దీక్షకు హుస్నాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో మాలాలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ గత నెల ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పును మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. బీజేపీ కుట్రలో భాగంగానే వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి కలిసున్న దళితులను విడగొట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో వ్యతిరేక పోరాట సమితి జాతీయ నాయకత్వం చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే కులగణన చేపట్టిన తర్వాత జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ లు కలిసి ఉంటే అగ్రవర్ణాలు అధికారం కోల్పోతారని కుట్రలో భాగంగా వర్గీకరణ అంశాన్ని తెరపై తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెన్నరాజు కో -కన్వీనర్ బోజు రవీందర్, నియోజకవర్గ మీడియా సెల్ కన్వీనర్ జాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ ఆరే కిషోర్, హుస్నాబాద్ డివిజన్ కన్వీనర్ యాస శ్రీనివాస్, హుస్నాబాద్ టౌన్ కన్వీనర్ నోముల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున్ణ సమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తా వద్ద బుధవారం ఒక్కరోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్లు అల్లిబిల్లి నరసింహారావు, గుడమల సత్తయ్య, నరసింహులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, సూచనలను అన్ని రాష్ట్రాలలో మెజారిటీ దళితులు, గిరిజనులు, పార్లమెంటు సభ్యులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘాలు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ, సమాజ్వాది పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, సమతా సైనిక్ దళ్ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఈరోజు నిరసన కూడా చేపటారని అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పున్ణ సమీక్షించాలని రివ్యూ పిటిషన్స్ మేధావులు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు రాకేం శ్రీరాములు, వెన్నె రాజు, సానాదుల బాలపోచయ్య, ఎలక దేవయ్య, జిల్లా కో కన్వీనర్ జంజీరపు ఎల్లేష్, మహిళా కార్యకర్తలు, మాల మహానాడు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లైట్ మోటర్ డ్రైవర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా మహేష్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ది లైట్ మోటార్ డ్రైవర్‌ల సమావేశం బుధవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని బీరప్ప దేవాలయ ఆవరణలో నిర్వహించారు. సమావేశం అనంతరం ది లైట్ మోటార్ డ్రైవర్ ల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆడెపు మహేష్, అధ్యక్షుడిగా పచ్చిమడ్ల మహేందర్, ఉపాధ్యక్షులుగా సాతెల్లి దేవయ్య, మాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యాట కనకయ్య, కార్యదర్శులుగా ఎండీ. మాలిక్, పాక శ్రీనివాస్, కోశాధికారిగా పసుల సంతు, గౌరవ సలహాదారుడిగా పాక బాలయ్య, సలహా సభ్యులుగా ఎండీ. భాష్మీయా, కర్నె కర్ణాకర్, శివ, శ్రీరాం రమేష్, ముస్త్యాల మహేందర్, భాస్కర్, సుజ్జు, రాచకొండ శ్రీనివాస్, తాటిపాముల పరుశరాములు, చీర్ల మురళి ని ఎన్నుకున్నారు.

సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ సీసీఎల్ ఐఐటీ రెండు రోజుల కార్యశాల

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్




నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సెంటర్ ఫర్ క్రియేటివ్ లర్నింగ్ సీసీఎల్ ఐఐటి గాంధీనగర్ ఆధ్వర్యంలో 2 రోజుల కార్యాశాల బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి శ్రీ.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ప్రారంభించారు. ఉదయం 10 గం,,లకు ప్రారంభమయిన ఈ కార్యశాల సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్,ఐఐటి గాంధీనగర్, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర-శిక్ష సిద్దిపేట జిల్లా సంయుక్తంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల కోసం వివిధ సృజనాత్మక పద్ధతులను అభ్యసనమునకు జోడించడం ద్వారా విద్యార్థులందు 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా కొనసాగుతుంది అని తెలిపారు. కార్యశాలకు సీసీఎల్, సౌత్ ఇండియా హెడ్రీ. విశాల్భట్ ఆధ్వర్యంలో రిసోర్స్ సభ్యులుగా రష్మి, వంశీ (అసిస్ట్, ప్రొఫెసర్, సీసీఎల్) లు వ్యవహరించనున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్



మాట్లాడుతూ పిల్లలు కార్యశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాధికారి శ్రీ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న కృత్యాలను క్షేత్రస్థాయిలో అమలు పరచాలని సూచిస్తూ, భవిష్యత్తులో జిల్లాలో ఒక క్రియేటివ్ లెర్నింగ్ కమ్ సైన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. కార్యశాలలోని ప్రదర్శనాంశాలను వారు పరిశీలించి స్వయంగా కొన్ని కృత్యాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కొన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి



నవతెలంగాణ-మర్కుక్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్జీటీయూ జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని పాములపర్తి ప్రాథమిక పాఠశాలలో మర్కుక్ మండల ఎస్జీటీ ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల అధ్యక్షులు రవి కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, 10 వేల పిఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలన్నారు. ప్రతి పాఠశాలకు కనీసం ముగ్గురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మర్కుక్ ఎస్జీటీ మండల నూతన అధ్యక్షులుగా బి.ముత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏ. కమలాకర్ రెడ్డి, కోశాధికారిగా పి.రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా హేమలత, శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శులుగా స్వప్న, విజయ కుమారి, నాయకులు మల్లికార్జున్, తదితరులు ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాటం

- పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శశిధర్ శర్మ



నవతెలంగాణ-రాయపోల్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని పీఆర్టీయూ సంఘం బాధ్యులు కృషి చేయాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆదరాస్ పల్లి శశిధర్ శర్మ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్‌లో పీఆరీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక సంఘం పీఆర్టీయూ అన్నారు. ప్రస్తుతం ఎస్జీటీలకు తీవ్ర నష్టం జరుగుతున్న మాట వాస్తవమేనని ఎస్జిటిల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ పీఆర్టీయూ సంఘంతోనే పరిష్కారం అవుతాయని ఉపాధ్యాయులందరూ పీఆర్టీయూ సంఘంపై నమ్మకం ఉంచండి సమస్యలను పరిష్కారం అవుతాయన్నారు. అలాగే రాయపోల్ మండల పరిధిలో పనిచేసే బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వివిధ మండలాల నుంచి రాయపోల్ మండలానికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు సన్మానం చేయడం జరిగిందన్నారు. రాయపోల్ పీఆర్టీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాయపోల్ పీఆర్టీయూ మండల నూతన అధ్యక్షులు దుంబాల ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి లచ్చుగారి కనకారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులు రమలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గతంలో లాగే మండలంలో పీఆర్టీయూ సంఘం పనిచేస్తుందని సంఘం బలోపేతం కోసం ఉపాధ్యాయుల సమస్యల కోసం గురుతర బాధ్యతతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ముత్యం రెడ్డి, రాజమహేందర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కే. సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిలు అబ్దుల్, విద్యాసాగర్, జిల్లా మాజీ అధ్యక్షులు పంతం వెంకటరాజు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మండల నోడల్ అధికారి సత్యనారాయణ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రాజశేఖర్, మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్నేహ మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి పూజలు



నవతెలంగాణ-సిద్దిపేట

స్నేహ మిత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ ఉపేందర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయనను గణేష్ మంటప నిర్వాహకులు గంప శ్రీనివాస్, పుల్లూరు శివకుమార్ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

కేవీఎం జెకె హొమ్స్ లో

కేవిమ్ జీకే హొమ్స్ ఆధ్వర్యంలో గందె శ్రీనివాస్ దంపతులు వినాయకునికి సరస్వతి, పత్రి పూజను ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీపాద శుక్ల ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింత దయాకర్, కొర్తివాడ శ్రీకాంత్, శోభన్, పశుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బలుమూరు వెంకట్‌ను కలిసిన గ్రూప్ 4 అభ్యర్థులు



నవతెలంగాణ-సిద్దిపేట

ఎమ్మెల్సీ బలుమూరు వెంకట్ ని గ్రూప్ 4 ఉద్యోగాలలో అన్విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలని సుమారు 100 మంది గ్రూప్ 4 అభ్యర్థులు హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ గ్రూప్ 4 ఉద్యోగాలలో పోస్టులు ఏ విధంగా బ్యాక్ లాగ్ అవుతున్నాయో సవివరంగా వివరించామని, వెంటనే టీజీపీఎస్సీ సెక్రెటరీ నవీన్ నికోలాస్ కి ఫోన్ చేసి గ్రూప్ 4 ఉద్యోగాలలో అభ్యర్థులకు అన్విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలని, లేకపోతే దాదాపు 3 వేల పోస్టులు బ్యాక్లాగ్ అవుతాయనీ ఎమ్మెల్సీ వివరించినట్లు తెలిపారు. దీనివల్ల గత ఐదేళ్ల నుంచి కష్టపడుతున్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపినట్లు తెలిపినారు. ఈ విషయం గురించి సెక్రటరీ నికోలస్ సార్ స్పందిస్తూ కావాలనే గ్రూప్ 4 ఉద్యోగాల 1:3 మెరిట్ లిస్ట్ పై స్తాయి ఉద్యోగాల మెరిట్ లిస్ట్ ఇచ్చాక ఇచ్చామనీ, గ్రూప్ 4 ఉద్యోగాలు బ్యాక్ లాగ్ అవ్వకుండా భర్తీ చేస్తామని తెలిపినట్లు తెలిపారు. సమస్యపై స్పందించిన బలుమూరు వెంకట్, సెక్రటరీలకు అభ్యర్థులు చందు, నాగరాజు, సాయి ప్రసాద్, శివ, స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

తోషిబా పరిశ్రమలో అంబరాన్నింటిన సంబురాలు

పటాన్ చెరులో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు
పటాన్‌చెరులో బాణసంచా కాల్చి... సంబురాలలో మునిగిన కార్మికులు
నవతెలంగాణ - పటాన్ చెరు




మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసిన ఏలూరి కమలాకర్



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

నూతన టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్ కుమార్ గౌడ్‌ని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఏలూరి కమలాకర్ బుధవారం హైదరాబాద్లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయానికి ఒక నిలువుటద్దం లాంటిదన్నారు. అందుకు నిదర్శనంగా మహేష్ కుమార్ గౌడ్ నియమించడం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంట పోతా రెడ్డి పేట కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాయపోల్ విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-రాయపోల్

రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుశాంత్‌కు ప్రధానోపాధ్యాయులు నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న సిశాంత్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖో ఖో పోటీలకు ఎంపికవ్వడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. ఈ నెల 13 నుంచి 15 వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగే పోటీలలో పాల్గొంటాడని తెలిపాడు. విద్యార్థి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు..

ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన మరో కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మీదినిపూర్ స్టేజి వద్ద ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి హైదరాబాద్‌కు చెందిన మల్లేశం, మహేష్ పర్వతాలు కారులో కొమరవెల్లి దేవస్థానానికి వెళుతున్న క్రమంలో మెడినీపూర్ స్టేజి వద్ద అదుపుతప్పి రోడ్డుపక్క నిలిచి ఉన్న కారుకు ఢీకొట్టింది. దాంతో ముందున్న రెండు కార్లకు వరుసగా ఢీకొనడంతో కార్లు ధ్వంసమయ్యాయి .హైదరాబాదు నుంచి వస్తున్న కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది గణేష్, మల్లేశం చేరుకొని ప్రథమ చికిత్స చేసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్దూరులో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని హనుమాన్ నగర్ లో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద బోయిని యాదగిరి-లత దంపతులు మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా గణేశునికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పానుగంటి తిరుపతయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేఖ చేతులమీదుగా బుధవారం లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య మాట్లాడుతూ మండలానికి 10 చెక్కులు రాగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు పంపిణీ చేశామన్నారు. నిరుపేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి ఆర్థికంగా ఉపయో గప డుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కన్నా అన్నదానమే గొప్పది



నవతెలంగాణ-జహీరాబాద్

అన్ని దానాల్లో కన్నా.. అన్నదానం గొప్పదని డాక్టర్ ఉజ్వల్ రెడ్డి అన్నారు. యువసేన గణేష్ నాగులకట్ట , శివాలయం ప్రక్కన స్వామి వివేకానంద గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొనిఆ గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మట్లాడుతూ.. నిత్యాన్నదానం చేసిన వారు మంచిస్థాయిలో ఉంటారన్నారు. అనంతరం వారికి గణేష్ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. కులమతా లకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, శ్రీకాంత్ రెడ్డి, అరుణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ శేఖర్, రాములు నేత, కాశీనాథు, అదేవిధంగా యువజన నాయకులు అశ్విన్ పటేల్, నరసింహ యాదవ్,చందు,మల్లు, ప్రమోద్,కిరాణ్, తదితరులు పాల్గొన్నారు..

క్రీడల్లో ప్రతిభను చాటాలి



నవతెలంగాణ-జోగిపేట

క్రీడల్లో ప్రతిభను చాటి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అందోల్ మండల విద్యాధికారి బండి కృష్ణ అన్నారు. స్థానిక హై స్కూల్ గ్రౌండ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అందోల్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, చదువుతోపాటు క్రీడలను అలవర్చుకోవాలన్నారు. అంతకుముందు క్రీడా జెండాను ఆవిష్కరించారు. ఈ క్రీడల్లో సుమారుగా 250 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. అందులో 64 మంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారికి ఫెడరేషన్ తరపున మెమొంటోలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం త్రినాథ రావు, సీనియర్ భాష ఉపాధ్యాయులు ఆకుల మాణయ్య, పాఠశాల పిడి వివి. శ్రీనివాస్, ఎన్సిసి ఆఫీసర్ నరోత్తం, ఉపాధ్యాయులు మంజ్యా నాయక్, అనిల్ కుమార్, మహేష్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

అంగరంగా వైభవంగా గణనాథుడి ఊరేగింపు



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలో పార్కుల వారి ఆధ్వర్యంలో గణనాథుడి ఊరేగింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కరీంనగర్, కేరళ నుంచి బ్యాండు, తూప్రాన్ నుంచి లైటింగ్, బోనాలు, ఒగ్గు కళాకారులు మొత్తంగా సుమారు 80 మందిని పిలిపించి అంగరంగ వైభవంగా గణనాథుని ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్కుల రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిగా వారితో



పాటు ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రెడ్డి,నవాజ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీ మహిళల ఆదాయాలను పెంచేలా ఇందిరా మహిళా శక్తి ఉండాలి

- సెర్ప్ సీఈఓ దివ్య, డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ప్రియాంక



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం.ఎస్.హెచ్.జి. మహిళల ఆదాయాలను పెంచేలా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఉండాలని సెర్ప్ సిఈఓ దివ్యా, డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్ ప్రియాంక ఆలా, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ గోపిలు జిల్లా అదనపు కలెక్టర్ లు, డిఆర్డిఓ, పశు సంవర్ధక శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘ మహిళల ఆదాయ స్థాయిలను పెంపొందించి వైవిధ్యభరితమైన జీవనోపాధిని సృష్టిస్తూ మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపకల్పన చేశారని తెలిపారు. మహిళలకు ఆసక్తి ఉన్న వృత్తి, నైపుణ్య రంగాల్లో శిక్షణను ఇప్పించడంతో పాటు బ్రాండింగ్, మార్కెటింగ్‌లలో మెలకువలు నేర్పించేందుకు సౌకర్యాలను కల్పించనునన్నట్లు పేర్కొన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఉమ్మడి ప్రాసెసింగ్ కేంద్రాలతో పాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక చిన్నతరహా పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నారని. ఇందులో బాగంగా ఆసక్తిని కనబరిచే లబ్దిదారులకు యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు కూడా ఇప్పించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అవడంతో పాటు , భవిష్యత్తు తరాలకు మార్గనిర్దేశకంగా నిలిచేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి జగత్ కుమార్ రెడ్డి, అడిషనల్ డిఆర్డిఏ బాలకృష్ణ తదితరులు పాల్గోన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన తాజా మాజీ సర్పంచ్ రజిత రమేష్



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల. పరిధిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ రాజిత రమేష్ తన సొంత ఖర్చులతో వినాయకుడి వద్ద అన్నదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపోచమ్మ దేవాలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించమన్నారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కంచర్ల స్వామి, గణపతి అసోసియేషన్ సభ్యులు చంద్రారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని నవరాత్రుల్లో భక్తి చాటుతున్న బాలికలు



నవతెలంగాణ-నంగునూరు

వినాయకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ ఈ బాలికలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సిద్ధపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన చిన్నారులు ఓరుగంటి హర్షిత, లహరి, జాప ఆర్తి, రేణుక, హరిక,ఆరాధ్య,బర్మ వైష్ణవి లు ఉన్నత పాఠశాలలో చదువుతు, వీరు అసోసియేషన్‌గా ఏర్పడి వినాయక వండపాన్ని ఏర్పాటు చేశారు. సొంతంగా జమ చేసుకున్న నగదుతో పాటు, గ్రామ పెద్దల వద్ద చందాను సేకరించి వినాయకుణ్ణి ప్రతిష్ఠిం చారు. నవరాత్రులు పూజలు చేస్తూ భక్తితో వినాయకున్ని కొలుస్తున్నా రు. నిమజ్జనం సైతం ఘనంగా నిర్వహి ంచ నున్నారు. చిన్నారులైనా, వినాయకుడి ఉత్స వాలను ఘనంగా నిర్వహిస్తుండటంతో వీరి పట్టుదలను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

కళ్యాణ లక్ష్మీకి తులం లేదు ఫలం లేదు

- హైడ్రాతో హైడ్రామా చేస్తున్న ప్రభుత్వం
- తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టో హామీలను తుంగలో తొక్కి, కళ్యాణ లక్ష్మికి తులం లేదు ఫలం లేదని తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలలో రూ.1,000,16లను పేద ఆడబిడ్డలకు కానుకగా ఇచ్చామన్నారు. అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం లేదు ఫలం లేకుండా చేసిందని తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాతో హైడ్రామా చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన మంచి పనులను మర్చి పోయే విధంగా ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతన్నలకు ఇస్తానన్న రైతు బంధు పేరు మార్చి ఇచ్చే రైతు భరోసాకు భరోసా లేదని విమర్శించారు. రైతుల అందరికీ పూర్తిగా రుణమాఫీ చేయకుండా తెలంగాణ రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెంచుతామని చెప్పిన రూ.4016 ల పింఛన్ మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయిందన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగులతో, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిందన్నారున. ఈ సమావేశంలో కౌన్సిలర్ ఉమా సత్యలింగం, బిఆర్ఎస్ నాయకులు ఎండి సత్తార్, యూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు పసుల నర్సింగరావు, కోరబోయిన ప్రవీణ్, ప్రభాకర్, శివ, పాల్గొన్నారు.

యాదవ యూత్ స్టార్ వినాయక మండపంలో అన్న దానం



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధి కాస్లాపూర్ గ్రామంలో యాదవ స్టార్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉత్సవాల ఐదవ రోజున మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వీరబోయిన నీలమ్మ లింగం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాద వితరణ చేసారు. ఈ సందర్భంగా యాదవ్ స్టార్ యూత్ సభ్యులు ఎస్ఐకు ఘనంగా సత్కరించి, ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉత్సవాలను శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించడంలో మండల ప్రజలు తమ సహాయ సహకారాలు ఇలాగే కొనసాగించాలని కోరారు.

విశ్వవేదికపై భారత కీర్తి పతాక చాటిన రోజు

- జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు



నవతెలంగాణ-గజ్వేల్

స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11 ఇదే రోజున విశ్వమత మహా సభల్లో విశ్వవేదికపై భారత కీర్తి పతాక చాటారని జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు అన్నారు. బుధవారం గజ్వేల్ లో ఆయన మాట్లాడుతూ అమెరికా చికాగో నగరంలో జరిగిన సభలకు భారతదేశం తరపున స్వామి వివేకానంద హాజరయ్యారని అయన అమెరికా దేశ సోదర సోదరీమణులారా అంటూ ఓ యువ సన్యాసి సంబోధించగానే ఆ సమావేశ మందిరమంతా కొన్ని నిమిషాల పాటు మారుమోగిందని ఆయన అన్నారు. ఏర్పాటు చేసిన ఆ సమావేశాల్లో భారతదేశ గొప్పతనం హైందవ మత నిండూతనాలు లోకానికి తెలిశాయని వివేకానందుడు విశ్వ విజేతగా నిలిచారన్నారు. భవిష్య మత సిద్ధాంతాన్ని తన సందేశంగా లోకానికి అందించారని గుర్తు చేశారు. ఆధునిక యుగ ప్రవక్తగ స్వామి వివేకానంద ఎదిగారని వారి నుంచి నేటి యువత స్ఫూతిని పొంది ఆత్మ విశ్వాసంతో చెడు వ్యాసనాలను మాని భారతదేశాన్ని విశ్వగురువుగా ఉంచడానికి ముందుకు సాగుదాం అన్నారు.

క్రీడలు మానసికల్లాసానికి దోహదపడతాయి

- మండల విద్యాశాఖ అధికారి బండి నర్సమ్మ



నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి బండి నర్సమ్మ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఎస్జిఎఫ్ క్రీడలు ముగింపుతో బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర దౌల్తాబాద్‌లో నిర్వహించడం జరిగింది. వివిధ పోటీలలో మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది అన్నారు. విద్యతో పాటు ఆటలు కూడా ఎంతో అవసరమని సూచించారు. చదువుతోపాటు విద్యార్థులను ఆటల్లో కూడా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల నిర్వహణకు బహుమతులను దాత సిఆర్పి రాజు అందించడం జరిగిందని అదేవిధంగా ఆటల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు భోజన సౌకర్యాలను అందించినటువంటి దాత బి.గోవర్ధన్ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, మహేష్ రెడ్డి, హరికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు విష్ణు, సురేష్, మౌనిక, డంబిల్, సిఆర్పిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులే శ్రేష్టం

- పదేళ్ల నుంచి మట్టి గణపతిని ప్రతిష్టిస్తున్న ఆలయ వ్యవస్థాపకులు హరిపంతులు
- ఘనంగా సన్మానించిన రామకోటి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు



నవతెలంగాణ-మర్కుక్

మట్టి గణపతులే శ్రేష్టమని శ్రీరామకోటి భక్త సమాజం దార్మిక సేవా సంస్థ మట్టి గణపతులను సన్మానించిన ప్రోత్సాహస్తుందని. అందులో భాగంగా గత పదేళ్ల నుంచి మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలోని రామాలయంలో ప్రతిష్టించిన మట్టి గణపతిని సందర్శించి ప్రతిష్ట ముఖ్య కారకులు ఆలయ వ్యవస్థాపకులు హరిపంతులు, అలాగే కేసీఆర్ కాలనీ గణేష్ భక్త బృందం వారి ఇరువురిని బుధవారం ఘనంగా సన్మానించారు. సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్లాస్టరప్ ప్యారిస్తో ముప్పుందని స్వచ్ఛమైన మట్టితో చేసిన గణపతినే ప్రతి ఒక్కరు ప్రతిష్టించి పర్యావరణంలో అందరు బాగా స్వాములు కావాలని తెలిపారు. అదే విదంగా నిమజ్జన సమయంలో కూడ భగవన్నామ స్మరణతో, భజనలతో గణపతిని నిమజ్జనం చేయాలన్నారు. ఆధ్యాత్మిక సనాతన ధర్మం గురించి అందరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు, తదితరులున్నారు.

మట్టి గణపతి విగ్రహాలే పర్యావరణానికి మేలు

- సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మైలారం గ్రామంలో గత ఆరేళ్లుగా మట్టి విగ్రహాన్ని పూజిస్తూ ఉత్సవాలని నిర్వహిస్తున్నామని సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలతో పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని అందువలన ఆదర్శంగా నిలుస్తూ ఉత్సవాలని నిర్వహిస్తున్నామని, మట్టి విగ్రహాలే పర్యావరణానికి మేలు అని అన్నారు. గణపతి మండపాల వద్ద డీజే సౌండ్స్ లాంటివి పెట్టకుండా శబ్ద కాలుష్యం కాకుండా భక్తి ప్రపత్తులతో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సాంప్రదాయంగా భజన కీర్తనలు పాడుకుంటూ గణనాథుని నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. 21 మంది సభ్యులు తొమ్మిది రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన నాగపురి



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, దూల్మిట్ట, మండలాల్లోని వల్లంపట్ల, బైరాన్ పల్లి, కూటిగల్, బెక్కల్, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్, లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అనారోగ్యాలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న వైద్యానికి ఖర్చు కాగా. ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించి. లబ్ధిదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలిత మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షులు వేల్పుల ప్రకాష్ ,తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మర్కుక్ : మండల పరిధిలో నిపాములపర్తి గ్రామంలో జై భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని పాములపర్తి తాజా మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానిం చారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, నాయకులు నర్సింలు, యూత్ సభ్యులు, తదితరులున్నారు

నా సంకల్పం దుబ్బాక అభివృద్ధి

- కత్తి కార్తీక గౌడ్

నవతెలంగాణ- దుబ్బాక : దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే తన సంకల్పమని అందులో భాగంగా ప్రతి ఏటా వినాయక విగ్రహాన్ని నెలకొల్పి నిత్య పూజలు, నిత్యాన్నదానం చేయడం జరుగు తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ స్పష్టం చేశారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, పద్మారావు గౌడ్,దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారం, సూచనలతో నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని కత్తి కార్తీక కార్తీకదీపం ఏర్పాటుచేసిన వినాయక విగ్రహ మండపాన్ని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 14 న మాజీ మంత్రులు హరీశ్ రావు,పద్మారావు గౌడ్,ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లు ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు దుబ్బాకకు విచ్చేస్తున్నట్లు తెలిపారు.ఆమె వెంట పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గణేష్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన కౌన్సిలర్

నవతెలంగాణ -గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని గణేష్ విగ్రహం వద్ద బుధవారం 16 వార్డు కౌన్సిలర్ తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లాడుతూ భారీగా వర్షాలు కురుస్తున్నాయని పంటలు పండాలని అదే స్థాయిలో దిగుబడి రావాలని దేవుని కోరుకున్నట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని 15 వార్డు కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, లక్ష్మీ ప్రసన్న నగర్ కాలనీ అధ్యక్షులు సదానందం, బీ జే పీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో ఆటోలకు ప్రత్యేక నంబర్లు

ఆటోలకు నంబర్లు వేయించిన తూప్రాన్ ఎస్ఐ శివానంద్

నవతెలంగాణ - తూప్రాన్ : తూప్రాన్ మండలంలోని జాతీయ, గ్రామ రహదారులపై ప్రమాదాల నివారణకు తూప్రాన్ మండలానికి చెందిన ఆటోలకు పోలీస్ వారు ప్రత్యేక సిరియల్ నెంబర్ వేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం గురువారం రోజున మీడియాతో తెలిపారు. ఈ సందర్భంగా తూప్రాన్ ఎస్ఐ శివానంద్ విలేకరులతో మాట్లాడుతూ ఆటో నెంబర్ అనేది దూరం నుండి కనబడే విధంగా పెయింటర్ తో రేడియం కలర్ తో వేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆటోలలో ప్రయాణికులు పరిమితికి మించి ప్రయాణించవద్దని డ్రైవర్ లకు డ్రైవింగ్ లైసెన్స్,ఆటోలకు సంబంధించిన కాగితాలు ఉంచుకోవాలని డ్రైవర్లకు సూచించారు.ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలు తూప్రాన్ నుండి ప్రయాణికులను తీసుకెళ్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్న ఉద్దేశంతో మండలానికి చెందిన ఆటోలకు ప్రత్యేక నంబరు వేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ శివానంద్ తెలిపారు.

కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్

గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్ : మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు బుధవారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యుల సమక్షంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపిన 39 మంది వాహనదారులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సభ్యులకు గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వద్దనే ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. మీరు మీ కుటుంబ సభ్యులను భార్య పిల్లలను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు.ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డు పైకి వస్తుందన్నారు. యజమాని లేని కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుందని,ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ఏదైనా ప్రమాదం జరిగితే రక్షణ లేకుండా పోతుందన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులకు దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వారికి కూడా ఇన్సూరెన్స్ వర్తించదని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి వాహనాలు నడపాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన వారు అతి వేగంతో వాహనాలు నడిపి జరిగిన ప్రమాదాల గురించి పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మద్యం సేవించిన వారితో మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సెలింగ్ వచ్చిన 39 మందిని విడతలవారీగా కోర్టుకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

కాణిపాక వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం

ముఖ్యఅతిథిగా ఎంపీపీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ

నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని కాణిపాక వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం ప్రతిరోజు కొనసాగుతున్నది. 26 సంవత్సరాలుగా అనవాహితిగా కొనసాగుతున్న కానిపాక వినాయక యూత్ వారు బుధవారం రోజున నిత్యాన్నదానం కార్యక్రమంలో భాగంగా 5వ రోజు మహా అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. వినాయక మండపంలో లక్ష్మీ గణపతి హెూమం, కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో సుమారు 50కి పైగా మంది మహిళలు పాల్గొని వినాయకుడికి మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీపీల ఫోరం మాజీ మెదక్ జిల్లా అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సతీష్ చారి, కాణిపాక వరసిద్ధి వినాయక యూత్ అధ్యక్షులు బొడ్డు రవి, శ్యామ్, ఆంజనేయులు శ్రీకాంత్, శివ, శ్రీధర్, బొర్ర శ్రీధర్, నందాల శ్రీధర్ ,ఓం ప్రకాష్ ,సాయి, జయప్రకాష్, వీరభద్ర,తదితరులు పాల్గొన్నారు.